



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 11 సంచిక : 191 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 18 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :191 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 18 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## తప్పు మీది కాదు... ఈవీఎంలది

- కూటమి ప్రభుత్వంపై రోజా విమర్శలు
- రాష్ట్రంలో మెడికల్ కాలేజీలకు మంగళం పాడేశారని వెల్లడి
- స్కూళ్లను కూడా ఎత్తివేస్తున్నారంటూ విమర్శలు
- బాగుందయ్యా బాగుంది అంటూ వ్యంగ్యం



పెన్ పవర్ డెస్క్:వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో వైద్య కళాశా లలకు మంగళం పాడేశారని, రైతు భరోసా కేంద్రాలను కూడా ఎత్తివేస్తున్నారని, ఇప్పుడు పాఠశాలల వంతు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, విద్య ప్రభుత్వ బాధ్యత కాదు అని మీరు ముందే చెప్పారు లెండి... తప్పు మీది కాదు, తప్పంతా ఈవీఎంలదే అని ఎద్దేవా చేశారు. "ఐదు

వివరాలు 2లో..

## వైవీ సుబ్బారెడ్డి తల్లి మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

- అనారోగ్యంతో బాధపడుతున్న వైవీ సుబ్బారెడ్డి తల్లి
- సోమవారం వేకువజామున కన్నుమూత
- మేదరమెట్లలో అంత్యక్రియలు
- హాజరుకానున్న జగన్!



పెన్ పవర్ డెస్క్:వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి య ర్రం పిచ్చమ్మ (85) ఈ వేకువజామున కన్నుమూసిన సంగతి తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.వైవీ సుబ్బారెడ్డికి మాతృవియోగం కలగడం పట్ల వైసీపీ అధినేత జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పిచ్చమ్మ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. కాగా, వైవీ సుబ్బారెడ్డి తల్లి అంత్యక్రియలు రేపు బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఉదయం 10.30 గంటలకు జరగనున్నాయి. పిచ్చమ్మ అంత్యక్రియలకు జగన్ కూడా హాజరవుతారని తెలుస్తోంది.

## వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారు

- సభా సమావేశాల నుంచి నేడు వైసీపీ సభ్యుల వాకౌట్
- బయట ఉన్న వైసీపీ సభ్యులను మార్షల్స్ సాయంతో లోపలికి తీసుకురావాలన్న లోకేశ్
- చైర్మన్ కు ఆ అధికారం ఉందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:వైసీపీ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు ప్రయత్నించారని మంత్రి నారా లోకేశ్ ఆరోపించారు. ఇప్పుడు ఆ అంశంపై సభలో చర్చలో పాల్గొనకుండా, వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారని ధ్వజమెత్తారు. శాసనమండలిలో 2019-24 మధ్య అవినీతి, అక్రమాలపై చర్చను నిరసిస్తూ వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందించారు.

వివరాలు 2లో..

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

- ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు
- ఆ సమయంలో మాట్లాడిన డిప్యూటీ సీఎం
- మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందన్న పవన్



పెన్ పవర్ డెస్క్:ఏపీ ఉపాధి హామీ పథకంలో గత వైసీపీ ప్రభు త్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసెంబ్లీలో ఆరోపించారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందని పవన్ పేర్కొన్నారు.ప్రభుత్వం ఇప్పటివరకు 564 మండలాల్లో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. ఈ పరిశీలన లో అనేక అవకతవకలు

వివరాలు 2లో..

# త్రిభాషా విధానంలో తప్పేముంది?

- వివాదాస్పదంగా మారిన త్రిభాషా విధానం
- ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు
- త్రిభాషా విధానాన్ని సమర్థించిన వైనం
- ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఉపయోగం అని వెల్లడి



పెన్ పవర్ డెస్క్: అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల-2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు, వివాదాస్పదంగా మారిన త్రిభాషా విధానం అంశంపై తమ వైఖరి వెల్లడించారు. త్రిభాషా విధానంలో తప్పేమీ లేదని అన్నారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ కు మాత్రమేనని, భాష అనేది భావవ్యక్తీకరణ సాధనం అని వివరించారు. "ఇంగ్లీష్ మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ, మాతృభాషలో చదువుకున్న వారే ప్రపంచ వ్యాప్తంగా రాణించారు. భాష ఏదైనా సరే, దాన్ని ద్వేషించడంలో అర్థం లేదు. మన విషయానికొస్తే... మన మాతృభాష తెలుగు, మనకు హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళుతున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు ఇంకా పెరుగుతా యి. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుంది" అని చంద్రబాబు వివరించారు. కాగా, త్రిభాషా విధానాన్ని తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ శుభవార్త

- ఇకపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం
- మార్చి 24 నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు
- సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం
- బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం

వివరాలు 2లో..



## అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీ భవన్‌లా కాదు

- సభను నడపడంలో ప్రభుత్వం విఫలమైందన్న అక్బరుద్దీన్
- సభలో మాట్లాడదామంటే మైక్ ఇవ్వడం లేదని ఆగ్రహం
- సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం కూడా ఇవ్వలేదని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి, కానీ గాంధీ భవన్‌లా కాదని మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. సభ నడుపుతున్న తీరును నిరసిస్తూ మజ్లిస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు.శాసనసభను నడపడంలో ప్రభుత్వం విఫలమైందని అక్బరుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. సభలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా? అని ప్రశ్నించారు. ఇది గాంధీ భవన్ కాదు... తెలంగాణ శాసనసభ అని గుర్తుపెట్టుకోవాలని ఆయన అన్నారు.

వివరాలు 2లో..

## బెంగాల్‌లో మమతా బెనర్జీ శాంతిభద్రతలను కాపాడలేకపోయారు

- కుంభమేళా సందర్భంగా మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న యోగి
- బెంగాల్‌లో రెండు వర్గాల మధ్య పోరును అడ్డుకోలేకపోయారని విమర్శ
- కర్ఫ్యూ విధించినా నేరాలను నివారించలేకపోతున్నారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:పశ్చిమ బెంగాల్‌లో ముఖ్య మంత్రి మమతా బెనర్జీ రాష్ట్రంలో శాంతిభద్ర తలను కాపాడలే కపోయారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శిం చారు. హోలీ సందర్భంగా బెంగాల్‌లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బీర్భమ్ లో రెండు వర్గాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణపై యోగి స్పందించారు .ప్రయాగ్ రాజ్‌లో మహా

వివరాలు 2లో..



## గోమాతల్లో మాగ్నెటిక్ పవర్ ఉంటుంది... అది క్రిములను నిర్మూలిస్తుంది

- భిల్వారాలో తులసి గోశాల నిర్మాణానికి భూమి పూజ
- హాజరైన పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా
- గో సంరక్షణ జరగకపోతే వ్యవసాయం నాశనమవుతుందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా గోసంరక్షణ ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గోమాతల్లో అయస్కాంత శక్తి (మాగ్నెటిక్ పవర్) ఉంటుందని చెప్పారు. ఆ అయస్కాంత శక్తి సూక్ష్మ క్రిములను నిర్మూలిస్తుందని అన్నారు. భిల్వారాలోని శంభుపురా

వివరాలు 2లో..



## కేటీఆర్‌తో తీన్మార్ మల్లన్న భేటీ

- అసెంబ్లీ వేదికగా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం
- కేటీఆర్, హరీశ్ రావుతో తీన్మార్ మల్లన్న సమావేశం
- బీసీ నేతలతో కలిసి కేటీఆర్‌కు మల్లన్న మెమొరాండం



పెన్ పవర్ డెస్క్:అసెంబ్లీ వేదికగా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ బహిష్కృతనేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్ కుమా ర్)... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావుతో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నేతలను కోరారు. బీసీ నేతలతో కలిసి కేటీఆర్‌కు మల్లన్న

వివరాలు 2లో..

## ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ... చంద్రబాబు ఛాంబర్ కు వెళ్లిన పవన్



- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం
- పలు కీలక నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు కేబినెట్
- కేబినెట్ భేటీ ముగిశాక చంద్రబాబుతో పవన్ ప్రత్యేక సమావేశం

పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీ ముగిశాక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... సీఎం చంద్రబాబు ఛాంబర్ కు వెళ్లారు. చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అంతకుముందు కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. టీచర్ల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లును ఆమోదించింది. రాజధానిలో భూ కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయాలకు కూడా నేటి మంత్రి వర్గ సమావేశం ఆమోదం తెలిపింది. చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం లభించింది. నంబూరులో వీవీఐటీయూ విద్యాసంస్థకు ప్రైవేట్ వర్సిటీ హోదా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ముదురుతున్న భాషా విధానం

దేశంలో భాషా వివాదం రాజకీయ రంగు పులుముకుంది. తమిళనాడులో ఎలాగైనా హిందీ అమలు జరగాల్సిందేనని కేంద్రం భావిస్తోంది. అయితే అందుకు అవకాశం లేదని, హిందీ భాషను అమలు చేసేదేలేదంటూ తమిళనాడు డీఎంకే సర్కార్ కరాకండిగా చెబుతోంది. దీంతో ఎటూ తేల్చుకోలేని అన్నాడీఎంకే సైతం కేంద్రం పెత్తనం ఏమిటనే వాయిస్ వినిపిస్తోంది. అయితే త్రి భాషా వివాదం రగులుతున్న సమయంలో అనూహ్యంగా గుగూల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను ఇందులోకి లాగారు. భాషల రాజకీయ యుద్ధంలోకి పిచాయ్‌ను ఎందుకు తీసుకొచ్చారనేది ఇప్పుడు హాట్ టాఫిక్ గా మారింది. నియోజక వర్గాల పుర్విభజనతో పాటుగా త్రిభాషా విధానంపై తమిళనాడులో గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ త్రిభాషా విధానంపై చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లయింది. పిఠాపురంలో శుక్రవారం జరిగిన పార్టీ ఆవిర్భావసభలో పవ న్ కల్యాణ్ మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం హిందీని కేంద్రం రాష్ట్రం పై బలవంతంగా రుద్దుతోందంటూ వ్యతిరేకించడాన్ని తప్పుబట్టారు. దక్షిణాదిపై కేంద్రం హిందీని బలవంతంగారుద్దుతున్నారని మాట్లాడుతున్న ప్పుడు తమిళ సినిమాలను హిందీలోకి డబ్బింగ్ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై డీఎంకే కూడా ఘాటుగా స్పందించింది. భాషా విధానంపై తమిళనాడు వైఖరిని పవన్ తప్పుగా అర్థం చేసుకున్నారని పార్టీ అధికార ప్రతినిధి సయీద్ హాఫీజుల్లా అన్నారు. వ్యక్తిగతంగా హిందీ, ఇతర భాషలను నేర్చుకోవడాన్ని తాము ఎన్నడూ అడ్డుకోలేదన్నా రు. ఆసక్తి ఉన్న వాళ్లు నేర్చుకోవడం కోసం ఇప్పటికే తమ రాష్ట్రంలో హిం దీ ప్రచార సభలను నిర్వహిస్తున్నామన్న ఆయన అయితే కేంద్రప్రభుత్వం మాత్రం ఎన్ఈపీ, పీఎం శ్రీస్కూల్స్ వంటి విధానాలతో రాష్ట్ర ప్రజలపై హిందీ భాషను రుద్దడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కాగా 1938 నుంచే తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ద్విభాషా విధానాన్నే అమలు చేస్తామని ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో చట్టాన్ని కూడా అమలు చేసుకున్నామని మరో సీనియర్ నేత ఎళంగోవన్ అన్నారు. 1968లో బిల్లు ఆమోదం పొందినప్పుడు పవన్ కల్యాణ్ ఇంకా పుట్టి ఉండరని, తమిళ రాజకీయాలపై ఆయనకు అవగాహన లేకపోయి ఉండొచ్చంటూ కాస్త ఘాటుగా స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను సమర్థించే వారు, వ్యతిరేకించేవారు చేసే ప్రకటనలతో ఈ వివాదం మరిం త ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే స్టాలిన్ ప్రభుత్వం ఈ వివాదాన్ని మరింత రాజేసేలాగే కనిపిస్తోంది. బడ్జెట్ ప్రసంగం పాఠంపై రూపీ స్థానంలో తమిళ గుర్తును ఉం చడం తాజా మలుపు. ఈ చర్య ద్వారా స్టాలిన్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ నేతలను మరింత రెచ్చగొట్టినట్లయింది. మరోవైపు నియోజక వర్గా ల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే అన్యాయం పై ఈ నెల 22న ఏర్పాటు చేసిన సదస్సుకు దక్షిణాదిలోని దాదాపు అన్ని పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. ఇప్పటికే తెంగాణ ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి పూర్తి మద్దతు ప్రకటించగా, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా మద్దతు తెలిపింది. తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఈ సమావేశానికి మద్దతు తెలిపారు. మరోవైపు ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామి అయిన డీఎంకే ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి తాము తప్పక హాజరవుతామని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ప్రకటించారు. అన్నిటికి మించి ఒడిశాలో దాదాపు పాతికేళ్ల పాటు అధికారంలో కొనసాగిన, ప్రస్తుతం ప్రతిపక్షంగా ఉన్న బిజూ జనతాదళ్ కూడా ఈ సమావేశానికి హాజరవుతుండడం విశేషం. ఈ సమావేశం ద్వారా స్టాలిన్ మరోసారి ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తేవడంతో పాటు హిందీ వ్యతిరేక ఆందోళనలతో కలిపి వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకొంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క ఏపీ సీఎం, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం దీనిపై తన వైఖరిని స్పష్ట చేయకపోవడం గమనార్హం. ఎన్డీఏ కూటమి భాగస్వామిగా ఉండడమే అందుకు కారణంగా భావించవచ్చు. ఇంత గొడవ జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ నేతలు సన్నాయి నొక్కులతో సరిపెడుతున్నారే తప్ప ఈ రెండు ప్రధాన అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం వెనుక బీజేపీపెద్దలకు అన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మాదిరిగా తమిళనాడులో కూడా ఏదైనా రహస్య అజెండా ఉందేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రంపై పోరాటానికి తమిళ పార్టీలు ఎల్లప్పుడు ముందే ఉంటాయి. ముఖ్యంగా భాష విషయంలో అసలే వెనకడుగు వేయకపోగా.. హిందీ భాషను 1968 తమిళనాడులో ప్రవేశు పెట్టాలనుకుంటే అప్పుడు ఓ యుద్ధమే జరిగింది. తాజాగా కేంద్రం త్రి భాషా విధానాన్ని వ్యతిరేస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా సమానికి సై అంటున్నారు. కానీ తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై మాత్రం.. హిందీ ఎందుకు కావాలో తెలుపుతూ సుందర్ పిచాయ్‌కి చెందిన ఓ వీడియోను నెట్టింట పోస్ట్ చేశారు. పాఠశాలలో తాను హిందీని ఎలా నేర్చుకున్నానో అందులో ఆయన చెప్పుకొచ్చారు. తన ఎదుగుదలకు హిందీ కూడా ఓ కారణమని ఆ వీడియోలో చెప్పకనే చెప్పారు. టెక్ దిగ్గజం మూడు భాషలు నేర్చుకోగలిగితే, అదే అవకాశం రాష్ట్రంలోని అన్ని విద్యార్థులకు అందుబాటులో ఉండాలని అన్నామలై అన్నారు. మంత్రుల పిల్లలు, మనవరాళ్ళు పాఠశాలల్లో మూడు భాషలు నేర్చుకోవడానికి అనుమతిస్తూ.. ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులు మాత్రం రెండు భాషలు మాత్రమే నేర్చుకోవాలని బలవంతం చేయడం దారుణమని అన్నామలై ఆరోపించారు. పార్టీని స్థాపించి డీఎంకేను పదేపదే వ్యతిరేకిస్తున్న నటుడు విజయ్ పార్టీ సహా.. తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షం డిఎంకే చిరకాల ప్రత్యర్థి అయిన అన్నాడీఎంకే కూడా డీఎంకే వాదనను బలపరుస్తోంది. తమిళులపై ఉచిత వ్యాఖ్యలు చేశారంటూ పార్లమెంటులో మోషన్ కూడా డీఎంకే దాఖలు చేయడంతో తమిళనాడు మొత్తం ఇపుడు ఇదే అంశంపై బీజేపీకి వ్యతిరేకంగా కౌంటర్ ఇస్తుంది. బీజేపీ మాత్రం ఇప్పటికి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయకపోవడంతో ఈ వివాదం ఎక్కడదాకా వెళుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతున్నారు

- మొదటి పేజీ తరువాయి

"సభా సమావేశాల అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. అందరూ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. 2019-24 మధ్య జరిగిన అవినీతి, అక్రమాలు, కుంభకోణాల అంశంపై చర్చకు అనుమతిస్తూ మండలి ఛైర్మన్ ఆదేశాలు జారీచేశారు. బీఏసీలో వైసీపీ సభ్యులు అంగీకరించారు. చర్చలో వైసీపీ సభ్యులు 2014-19 మధ్య జరిగిన పాలనపై ఆరోపణలు చేసి.. ఇప్పుడు సమాధానం ఇస్తుండగా వాకౌట్ చేస్తున్నారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోతారు. సమాధానానికి సమయం ఇవ్వరు. మేం సమాధానం ఇచ్చే సమయంలో సభలో ఉండరు. ఇది మొదటిసారి కాదు... పదేపదే ఈ విధంగా చేస్తున్నారు.

గతంలో మార్షల్స్ ను పెట్టి సభను నడిపించిన పరిస్థితి చూశాం. ఇప్పుడు మార్షల్స్ ను పెట్టి బయట ఉన్న సభ్యులను సభకు తీసుకురావాలని ఛైర్మన్ ను కోరుతున్నాం. ఆ అధికారం ఛైర్మన్ కు ఉంది. 2014-19 మధ్య పాలనపై వైసీపీ సభ్యులు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి కేసులు పెట్టారో చూశాం. చేయని తప్పునకు చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. మొదట రూ.3వేల కోట్ల కుంభకోణం అన్నారు, తర్వాత రూ.300 కోట్లని, తర్వాత రూ.27 కోట్లు అని అన్నారు. చేయని తప్పునకు జైలుకు పంపారు.

అచ్చెన్నాయుడు గారిని, ధూళిపాళ్ల నరేంద్ర గారిని, కొల్లు రవీంద్ర గారిని, నారాయణ గారిని.. అందరినీ ఇబ్బంది పెట్టారు. చర్చకు మేం సిద్ధంగా

ఉన్నాం. ఇవన్నీ బయటపడతాయని భయపడుతున్నారా? ఆరోపణలు చేసి పారిపోతున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. మా నాయకులు చేయని తప్పులకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు యత్నించారు. ఆ కేసులపై చర్చించాలి. నాపైనా 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. హత్నాయత్నం కేసు పెట్టారు. చర్చకు లేకుండా పారిపోయారు. ఇది సరికాదు" అని నారా లోకేశ్ స్పష్టం చేశారు.

## బెంగాల్‌లో మమతా బెనర్జీ శాంతిభద్రతలను కాపాడలేకపోయారు

- మొదటి పేజీ తరువాయి

కుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సరికాదని ఆయన అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని మరణోత్సవమని చేసి మాట్లాడారని విమర్శించారు. కానీ ఆమె నేతృత్వంలోని ప్రభుత్వం బెంగాల్‌లో జరిగిన రెండు వర్గాల మధ్య పోరును అడ్డుకోలేకపోయిందని యోగి ఆదిత్యనాథ్ చురక అంటించారు. మహా కుంభమేళాలో 66 కోట్లకు పైగా భక్తులు పాల్గొన్నారని, కానీ ఒక్క నేరం జరగలేదని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించే సామర్థ్యం యూపీ ప్రభుత్వానికి ఉందని ఆయన అన్నారు. కానీ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. యూపీలో హోలీ వేడుకలను ఆనందంగా

నిర్వహించామని, బెంగాల్‌లో మాత్రం పండుగ సమయాల్లో కర్ఫ్యూను విధిస్తున్నారని విమర్శించారు.

అయినప్పటికీ నేరాలను నివారించలేకపోయారని అన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించాలని అన్నారు. చెడు మనస్తత్వం కలిగిన వ్యక్తులతో కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు రావని ఆయన అన్నారు. పాలన అంటే విభజించడం కాదని గుర్తించాలని అన్నారు.

## తప్పు మీది కాదు... ఈవీఎంలది

- మొదటి పేజీ తరువాయి

కిలోమీటర్ల పరిధిలో గ్రామంలో ఒకే పాఠశాల ఉండాలా...? గ్రామంలో ఎన్ని బ్రాందీ షాపులైనా, ఎన్ని బెల్ట్ షాపులైనా ఉండొచ్చా...? బాగుందయ్యా బాగుంది అని ఊరంతా గుసగుసలాడుకుంటున్నారని తెలుస్తోంది" అంటూ రోజా సోషల్ మీడియాలో స్పందించారు.

## అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీ భవన్‌లా కాదు

- మొదటి పేజీ తరువాయి

సభలో మాట్లాడదామంటే మైక్ ఇవ్వడం లేదని వాపోయారు.

అధికార పార్టీ ఇలా చేయడం సరికాదని అన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రశ్నలను కూడా మార్చుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మజ్లిస్ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

# తెలంగాణ ప్రజా ప్రతినిధులకు టీటీడీ శుభవార్త

**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. ఇకపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. మార్చి 24వ తేదీ నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రజాప్రతినిధులను అప్పటి టీటీడీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, టీటీడీ ఛైర్మన్ బీఅర్ నాయుడు ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించే విధానం అమలు కానుంది. సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం కేటాయింపు ఉంటుంది. అలాగే బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం ఉంటుంది. ఒక ప్రజాప్రతినిధి తాలూకు ఒక సిఫార్సు లేఖపై ఆరుగురికి మించకుండా దర్శన అవకాశం కేటాయించనుంది. ఏపీ ప్రజా ప్రతినిధులకు ఇకపై సోమవారం దర్శనానికి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. దానికి బదులుగా ఆదివారం దర్శనం కోసం శనివారం నాడు టీటీడీ లేఖలు స్వీకరించనుంది. సుదీర్ఘంగా చర్చించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ వెల్లడించింది. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి సహకరించాలని భక్తులను టీటీడీ కోరింది.

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

- మొదటి పేజీ తరువాయి

బయటపడ్డాయని, ఉపాధి హామీ కింద ఖర్చు చేసిన నిధులపై అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పథకం ద్వారా వచ్చిన నిధులు లబ్ధిదారులకు చేరకుండా కొందరు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లాయని డిప్యూటీ సీఎం ఆరోపించారు.

ఇప్పటికే మొదలైన ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా మిగిలిన మండలాల్లో కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పనులను సమీక్షించి, అవినీతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇక ఉపాధి హామీ కూలీలకు వేతనాల పెంపు అంశం అనేది కేంద్రం పరిధిలో ఉంటుందని పవన్ వెల్లడించారు.

## గోమాతల్లో మాగ్నెటిక్ పవర్ ఉంటుంది... అది క్రిములను నిర్మూలిస్తుంది

- మొదటి పేజీ తరువాయి

గ్రామంలో తులసి గోశాల నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా కటారియా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గోవులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని, గోవుల సంక్షేమం కోసం మరింత కృషి జరగాలని, పరిశోధనలు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. పూర్వం గోవులను సంరక్షించడం ద్వారా తల్లులు ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. గతంలో రాజస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కటారియా, గోవుల ప్రాముఖ్యతను ప్రపంచం గుర్తిస్తుందని, ప్రతి ఇంట్లో వాటిని రక్షించే రోజు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోవులను సంరక్షించకపోతే దేశంలో వ్యవసాయం నాశనమవుతుందని ఆయన అన్నారు. పాఠ్యాంశాల్లో గోవుల గురించి చేర్చకపోవడం దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు.

అవినీతిని నిర్మూలించడానికి మోదీ నాయకత్వం వహించడం దైవ సంకల్పమని కటారియా అభివర్ణించారు. గతంలో పేదలకు చేరాల్సిన నిధులు అవినీతి కారణంగా చేరలేదని ఆయన అన్నారు.

## అందులో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నా: సీఎం చంద్రబాబు

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ పై నేడు ఏపీ అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, 10 సూత్రాలు నిర్దేశించుకుని స్వర్ణాంధ్ర విజన్ వైపు అడుగులేస్తున్నామని చెప్పారు. తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలతో దేశం అభివృద్ధి బాటలో ముందుకు పోతోందని... ఈ సంస్కరణల్లో ఒక శాతం నా భాగస్వామ్యం ఉన్నందుకు గర్విస్తున్నానని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి ప్రపంచవ్యాప్తంగా భారతీయులు నెంబర్ వన్ గా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి వందేళ్లు పూర్తవుతాయని పేర్కొన్నారు. పేదరికం లేని సమాజం, టెక్నాలజీ, పీ4 వంటి అంశాలను విజన్ డాక్యుమెంట్ లో పొందుపరిచామని తెలిపారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మున్సిపాలిటీ, మండలాల వారీగా విజన్ ప్రణాళిక సిద్ధమైందని అన్నారు. సచివాలయం యూనిట్ గా తీసుకుని ప్రణాళిక అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్టు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనాలు రూపొందిస్తామని తెలిపారు. ప్రజలే ఆస్తిగా నియోజకవర్గాల ప్రోగ్రెసివ్ విజన్ రూపొందించామని చెప్పారు. ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. కుటుంబ జీవన ప్రమాణాలు పెరిగేలా ఆర్థిక స్వావలంబన దిశగా కృషి చేస్తున్నట్టు వివరించారు. చేపలు ఇవ్వడం కాదు... చేపలు పట్టేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యం, తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రతి కుటుంబానికి నివాస స్థలం, ఇల్లు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యమని అన్నారు. సురక్షిత నీరు, గ్యాస్ కనెక్షన్ ఇలా అన్ని సౌకర్యాలు అందడమే లక్ష్యం అని వివరించారు. రానున్న రోజుల్లో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజి విద్యుదుత్పత్తి రంగాలు గేమ్ చేంజర్ లా మారతాయని స్పష్టం చేశారు. సంపద సృష్టికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, పరిశ్రమలు తీసుకురావడమే బాధ్యతగా ఎమ్మెల్యేలు పనిచేయాలని చంద్రబాబు సూచించారు. గత ప్రభుత్వం తరహాలో పరిశ్రమలను తరిమేయొద్దని అన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్ లో పెట్టగలిగామని, ఇలాంటి సమయంలో దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. 1990లోనే సమైక్యాంధ్ర ప్రదేశ్ కోసం విజన్ 2020 తీసుకొచ్చామని, చెప్పిన దానికంటే ఎక్కువ ప్రయోజనమే ఉమ్మడి రాష్ట్రానికి కలిగిందని వెల్లడించారు. ప్రధాని మోదీ వికసిత భారత్-2047ని అమలు చేస్తున్నారని, మనం స్వర్ణాంధ్ర విజన్-2047ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేలను భాగస్వాములుగా చేస్తూ నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్లకు రూపకల్పన చేస్తున్నట్టు వివరించారు. 2047 నాటికి ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారడమే లక్ష్యమని, తలసరి ఆదాయం రూ.55 లక్షలు సాధించేలా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేశామని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా లక్ష్యం నిర్దేశించుకున్నట్టు చంద్రబాబు వెల్లడించారు.

## ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ... చంద్రబాబు ఛాంబర్ కు వెళ్లిన పవన్

- మొదటి పేజీ తరువాయి

కల్పిస్తూ ఆమోదం తెలిపింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. పలు సంస్థలకు భూకేటాయింపులకు కూడా నేటి కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. అటు, ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా సమర్పించిన నివేదికకు కూడా కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రాన్ని యూనిట్ గా వర్గీకరణ చేయాలని నివేదిక కమిషన్ ఇవ్వగా, జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేయాలన్న ఎమ్మెల్యేల ప్రతిపాదనపైనా కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోవాలని నిర్ణయించారు. 2026 జనాభా లెక్కలు వచ్చాక జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి జాతీయ ఎస్సీ కమిషన్ కు పంపాలని నిర్ణయించారు. బుడగజంగాలు, మరో కులాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు తీర్మానం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చుతూ నేటి కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. పెనమలూరులోని తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు.

# కేటీఆర్‌తో తీన్మార్ మల్లన్న భేటీ

- మొదటి పేజీ తరువాయి

మెమొరాండం అందించారు. అలాగే బీసీ బిల్లుకు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా ఢిల్లీ వేదికగా తాము చేయబోయే ధర్నాకు మద్దతు ఇవ్వాల్సిందిగా తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ పార్టీ నేతలను కోరారు. వీరి భేటీపై సోషల్ మీడియాలో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. కాగా, పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న కారణంతో మల్లన్నను ఈ నెల 1న పార్టీ నుంచి కాంగ్రెస్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 5న టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఫిబ్రవరి 12లోపు వివరణ ఇవ్వాలని పేర్కొంది. అయితే, తీన్మార్ మల్లన్న నుంచి ఎలాంటి వివరణ రాలేదు. అందుకే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

# కేంద్ర మంత్రిని పరామర్శించిన చాట్రాతి ప్రసాద్



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,మార్చి 17:**కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ను ఏలూరు జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాదు ఆదివారం రాత్రి భీమవరంలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. శ్రీనివాస్ వర్మ ఇటీవల ఢిల్లీలో జరిగిన కారు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు జీలుగుమిల్లి బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# జిల్లాలో ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

## పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్



కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ పట్టణంలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాకినాడ సాలిపేట వద్ద ఉన్న పైడా సత్యరాజు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీనగర్ లోని మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ లో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లతో మాట్లాడి విద్యార్థుల హాజరు వివరాలు ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 28,963 మంది విద్యార్థులకోసం 142 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు తెలుగు పేపర్ పరీక్ష అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ప్రశాంతంగా జరుగుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు అందరు నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం విద్యార్థులు తమ వెంట మొబైల్ ఫోన్లు, ఎటువంటి పేపర్లు తీసుకువెళ్లడానికి వీలు లేదన్నారు. ఎండ వేడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువగా మంచినీరు తీసుకోవాలన్నారు. తగు ఆహార జాగ్రత్తలు పాటిస్తూ మంచిగా అన్ని పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

# గవర్నర్ ను కలిసిన జేఎన్టీయూకే విసి సిఎస్ఆర్కే ప్రసాద్

కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి ఎస్ ఆర్ కె ప్రసాద్ రాష్ట్ర గవర్నర్ యూనివర్సిటీ ఛాన్సర్ అబ్దుల్ నజీర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించారు. సోమవారం ఉదయం విజయవాడలోని రాజ్ భవన్ లో జేఎన్టీయూకే ఉపకులపతి సిఎస్ ఆర్ కె ప్రసాద్ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ని కలిసి యూనివర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విద్యాపరమైన అంశాలు త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహణపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జేఎన్టీయూకే యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందని సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు విద్యాసంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని అన్నారు. యూనివర్సిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన భవన నిర్మాణాలకు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సాంకేతిక రంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టేలా అధ్యాపకులను రీసెర్చ్ కావాల్సిన పీజీ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. త్వరలో జేఎన్టీయూకే విశ్వవిద్యాలయ 11వ స్నాతకోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని ఉపకులపతి సి ఎస్ ఆర్ కే ప్రసాద్ గవర్నర్ అబ్దుల్ నజీర్ కి వివరించారు. జేఎన్టీయూకే యూనివర్సిటీలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు రహదారులు డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన పూర్తి చేయనున్నామన్నారు. అందరి సమిష్టి



కృషితో జెఎన్టియుకె యూనివర్సిటీని అభివృద్ధి పథంలో పయనింప చేస్తామని అన్నారు.

# ధాన్యాన్ని దొంగలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**గోకవరం పెన్ పవర్ మార్చి 17**: గోకవరం పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి సమయాల్లో ఆటోలో తిరుగుతూ పొలాల్లో రైతులు ఉంచిన ధాన్యం బస్తాలను దొంగలిస్తున్న వ్యక్తిని సోమవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వివిఎస్వి పవన్ కుమార్ వెల్లడించారు. మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన గంటా బుల్లి వెంకటేశులు అనే కౌలు రైతుకు చెందిన ధాన్యం బస్తాలను గత పదకొండవ తేదీ మంగళవారం అర్ధరాత్రి సమయంలో దొంగిలించుకుపోయారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టగా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామానికి చెందిన సత్తినాటి వీరబాబును అనుమానితునిగా గుర్తించి విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు ఆన్లైన్ బెట్టింగ్లకు అలవాటు పడి అప్పులుపాలై సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో రాత్రి సమయాలలో అతని ఆటోలో తిరుగుతూ గోకవరం పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రక్కన ఉంచిన 70 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని దొంగలించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. పోలీసులు నిందితుడు నుండి ఆటోను 14 క్వింటాలు వరి ధాన్యాన్ని స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పీజీఆర్ఎస్ కు 404 అర్జీలు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17** :ప్రతివారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ. సత్యనారాయణబీ కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కెవీ.రామలక్ష్మిబీ సీపీవో పీ.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలలా నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం- 404 అర్జీలు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులు ఎప్పటికప్పుడు పురస్కారింబడాలన్నారు. ఈ వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పరిష్కరానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, మిల్లెట్స్, పండ్లు ఈ స్టాల్ లో ఉంచారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# మలకపల్లి పీ.హెచ్.సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు



**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 17:**తిరుగుడుమెట్ట గ్రామంలో మరపట్ల వినయ్ అనే 19 సంవత్సరాల యువకుడు అతిసార వ్యాధి బారినపడ్డ సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా మలకపల్లి పీ.హెచ్.సి డా.పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటుచేయడం జరిగింది. పంచాయతీ వారి సహకారంతో గ్రామం మొత్తం శానిటేషన్, త్రాగు నీటిని క్లోరినేషన్ చేయడం జరిగింది. అదేవిదంగా గ్రామంలోని వైద్యసిబ్బంది రెండు టీంలుగా ఏర్పడి ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. గ్రామంలో క్రొత్తగా ఎటువంటి కేసులు నమోదుకాలేదని చెపుతూ, ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్ధాలు తినరాదని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని వైద్య సిబ్బంది తెలియజేయడం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని డి.ఎల్.పి.ఓ వై.అమ్మాజీ, తాళ్లపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట రమణ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.పి.సుచందన, పంచాయతీ సెక్రటరీ సుభద్ర, ఎమ్.పి.హెచ్.ఈ.ఓ ఎస్.రమేష్, హెల్త్ సూపర్వైజర్ బి.కృపావరం, ఇతర ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వాలంటీర్లు ను ఉంచుతారా.తీసేసారా .

- నిగ్గు తేల్చండి.
- వాలంటీర్లు ను మోసం చేసిన కూటమి ప్రభుత్వం.
- మండలి లో ఎమ్మెల్సీ తోట ఫైర్.

**మండపేట. పెన్ పవర్.మార్చ్ 17** :నగర,గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలతో మమేకమైన వాలంటీర్ లను ఉంచుతున్నారా తీసేస్తున్నారా స్పష్టంగా ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిలదీశారు. శాసన మండలి సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.

వాలంటీర్స్ పై కూటమి ప్రభుత్వం మాట్లాడిన పదజాలాన్ని ఖండించారు. టిడిపి, బిజెపి, జన సేన కూటమి ప్రభుత్వం వాలంటీర్స్ నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది సెప్టెంబర్ లో ఎన్టీఆర్ జిల్లాలో వరదలు వచ్చినప్పుడు డిజార్డర్ మేనేజ్మెంట్ అన్ని సచివాలయ, పంచాయితీ సిబ్బందులతో పాటు వాలంటీర్స్ కూడా విధుల్లో పాల్గొనాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెమోను జారీ చేశారని గుర్తు చేశారు. ఆ మెమో నెంబర్ 2544493 తేది 7.9.2024 ను ఆయన ఉదాహరించారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్లు తో అవసరాలు తీర్చుకున్న తర్వాత నవంబర్ 2024 వరకు వాలంటీర్లకు సి.ఎఫ్.ఎం.ఎస్. ఐడి లు ఉన్నా 2,56,000 లక్షల వాలంటీర్ల ను మోసం చేసి విధుల నుండి తొలగించారన్నారు. ఇంత క్లియర్ గా విధుల్లో వాడుకున్నప్పుడు వారి ఉద్యోగాలకి కూడా గ్యారంటీ ఇవ్వాలనీ ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వాలంటీర్స్ జీతాలను రూ. 5,000 వేల నుండి రూ. 10,000 వేలకు పెంచుతామని మోసం చేయడమే కాకుండా వారి ఉద్యోగాలను కూడా ప్రశ్నార్థకం చేసిందని కౌన్సిల్ సాక్షిగా తోట తన గళాన్ని వినిపించారు. తమ ప్రభుత్వం తప్పు చేసిందని తమరు తప్పు పట్టినా పరవాలేదని చిత్తశుద్ధి ఉంటే మీనమేషాలు లెక్కించకుండా కూటమి ప్రభుత్వం వెంటనే వాలంటీర్స్



అందరిని తగిన ఉద్యోగాలు ఇచ్చి వారికి న్యాయం చేయాలన్నారు. ఒక మంత్రి అయితే వాలంటీర్స్ కు జీతం రూ.10,000 పెంచిన తరువాత చించినాడ స్వీట్లు, జున్ను ,పూతరేకులతో తన్ను కలవండి సంతోషిస్తానని ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# పది విద్యార్థులకు సర్పంచ్ వాహనాలు ఏర్పాటు



**కాజులూరు,పెన్‌పవర్,మార్చి17**ః గొల్లపాలెం పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాసేందుకు మంజేరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దూరభారం కావడంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానికి గ్రామ సర్పంచ్ గుంటూరి అప్పారావు నాలుగు సంవత్సరాలుగా పదోతరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెల్లేందుకు తన సొంత ఖర్చులతో వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు.పరీక్ష చివరి రోజువరకు విద్యార్థినీ విద్యార్థులకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వివరించారు. పదోతరగతి విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అన్ని విధాల గ్రామ సర్పంచ్ సహకరిస్తూ,తన సొంత వాహనానంలో కూడా ఆయనే స్వయంగా పరీక్షా కేంద్రానికి తీసుకురావడం జరిగింది.గ్రామానికే కాకుండా విద్యార్థులకు వాహన సదుపాయం కల్పించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామ సర్పంచ్‌గా ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా తనవంతు బాధ్యతగా విద్యార్థులకు అన్ని విదాలా సహకరించడం విశేషం.

# ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**అడ్డతీగల, పెన్ పవర్ ,మార్చి 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలోని అడ్డతీగల మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 364 మంది విద్యార్థుల్లో 363 మంది హాజరయ్యారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 177 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు కాగా, అందరూ హాజరయ్యారు. అయితే బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నమోదైన 187 మంది విద్యార్థుల్లో ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారు.

పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభం కాగా, విద్యార్థులు 9 గంటలకు పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 18 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అదనపు భద్రతా చర్యగా పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేసి, విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించే ముందు సమగ్ర తనిఖీలు నిర్వహించారు.

పరీక్షల మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు



చోటుచేసుకోకుండా, శాంతియుతంగా ముగియడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## సీతానగరంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** జగ్గంపేట మండలం సీతానగరం గ్రామంలో దేవి ఫిషరీష్ సహకారంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ సీతానగరం గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చడానికి దేవి ఫిషరీష్ యాజమాన్యం, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సందర్భంగా యజమాని వీర్రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారు మున్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో దేవి ఫిషరీష్ ఆకాష్, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, అడపా భరత్, కన్నబాబు, దేవరపల్లి మూర్తి, జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి శివ, బొద్దిరెడ్ల సుబ్బారావు, బద్ది సురేష్, కోడూరి సత్యనారాయణ, ముత్యాల సత్యనారాయణ, కాకర్ల కృష్ణాజి, తాతినేని నాగేశ్వరరావు, ఈర్పిన శ్రీను, గూడపాటి సత్యనారాయణ, కుదప మురళీకృష్ణ సీతానగరం గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## పెదపళ్ళ గ్రామ దేవత పోలేరమ్మకు రూ 2.7 లక్షల విలువైన రజత కిరీటం సమర్పణ



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17:**ఆలమూరు మండలం పెదపళ్ళ గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ వారి కి పెదపళ్ళ గ్రామానికి చెందిన జాస్తి వారి వంశీకులు వెండి కిరీటాన్ని సమర్పించారు. రూ. 2. 7లక్షలు విలువైన వెండితో రూపొందించిన ఈ కిరీటాన్ని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. కీ. శే జాస్తి సుబ్బన్న, లక్ష్మి నరసమ్మ, సూరన్న,సత్యవతి, శ్రీరాములు సూరమ్మ దంపతులు, వారి వారసులు అందరూ కలిసి ఈ కిరీటాన్ని తయారు చేయించి అమ్మవారికి అలంకరింపచేశారు. కార్యక్రమంలో జాస్తి భాస్కరరావు, వీర్రాజు, దాసరి శారదాదేవి, జాస్తి వెంకటేశ్వరరావు, జాస్తి శ్రీనివాస్, గ్రామ పెద్దలు,మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ .ఎస్. సి మొదటి రోజు పరీక్షలకు 99.29%హాజరు

ఎంఈఓలు వరప్రసాద్ , పాచ్ఛా సాహెబ్

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 16:** పదో తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ సోమవారం ప్రారంభమైంది .ఎస్.ఎస్.సి. పరీక్షలకు 567 మంది రెగ్యులర్ విద్యార్థులలో 563 మంది విద్యార్థులు హాజరుకాగా, నలుగురు విద్యార్థులు గైర్హాజరైనారని మండల విద్యాశాఖాధికారులు వరప్రసాద్, పాచ్ఛా సాహెబ్ అన్నారు. ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్ లో 229 మందికి 227 మంది, మహాత్మా గాంధీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల సెంటర్ లో 194 మందికి 194 మంది, పేరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెంటర్ లో 144 మందికి 142 విద్యార్థులు హాజరయ్యారని వారన్నారు. కాగా, గత సంవత్సరం పరీక్ష తప్పిన నలుగురు విద్యార్థులకు నలుగురు సోమవారం పరీక్షలకు హాజరైనారని మండల విద్యాశాఖ అధికారులు అన్నారు.

## ఏజెన్సీలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 17 :**పోలవరం నియోజకవర్గం లోని ఏజెన్సీ గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు కోరారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని వైద్య సదుపాయాలు కల్పించాలని అన్నారు .ఆ గ్రామాలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని కోరారు .గత ప్రభుత్వంలోని నియోజకవర్గంలోని కొయ్యలగూడెం ,టీ నర్సాపురం ,బుట్టాయిగూడెం మండలాలలో నిర్మాణాలు ప్రారంభించి బేస్మెంట్ వరకే పరిమితం అయ్యాయని వాటిని పట్టించుకోలేదని తెలిపారు. గిరిజన గ్రామాలలో వైద్యం అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇకనైనా ఆగిపోయిన హాస్పిటల్స్ ని నిర్మాణం చేపట్టి వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని స్పీకర్ని, సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రిని కోరారు. అసెంబ్లీ సమావేశాలలో పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు ఏజెన్సీలో వైద్య సేవలు గురించి మాట్లాడటంతో అందరూ ఆయనని ప్రశంసించారు.

## అంతరపంటగా కోకో సాగు లాభసాటి-ఉద్యానవన అధికారిణి రిని

**గోకవరం పెన్ పవర్ మార్చి 17:** ప్రస్తుత పరిస్థితుల్లో తనకు ఉన్న భూమిలోనే ఎక్కువ పంటలు పండించుకోవడం వల్ల రైతు నికర ఆదాయం పెరుగుతుందని కోరుకొండ ఉద్యానవన అధికారిణి రిని తెలిపారు. పలు రకాల పంటలు సాగువలన ప్రధాన పంటకు నష్టం కలిగినా అంతర పంటల ద్వారా నిలకడైన ఆదాయం సంపాదించవచ్చని ఆమె అన్నారు. అంతర పంటల్లో కోకో సాగు ప్రధానమైనది అని కోకో పంటను ఆయిల్ పామ్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేయవచ్చు అని తెలిపారు.

కోకో సాగు విధానం, యాజమాన్య పద్ధతుల గురించి హెచ్ ఓ రిని వివరించారు. కొబ్బరి ,ఆయిల్ పామ్ తోటలో హెక్టారుకు 400 నుండి 500 మొక్కలు నాటుకోవచ్చని, జూన్ జూలై మాసాల్లో కత్తిరింపులు చేయాలని చెట్టును గొడుగు ఆకారం ఉండేలా చూసుకోవాలని, పక్వానికి వచ్చిన పండులోని గింజలతో కూడిన గుజ్జును ఐదు రోజులు ట్రేలలో నిల్వచేసి ప్రతిరోజు కలుపుతూఉండాలని, గుజ్జు నుండి విడిపోయిన గింజలను బరకాలపై ఐదారు రోజులు ఎండబెట్టాలని ఆమె చెప్పారు. బాగా ఎండిన గింజలు ముదురు గోధుమరంగులోకి వస్తాయని, తేమ ఉన్న గింజల పై ఫంగస్ చేరి మంచి గింజలను కూడా పాడుచేసే ప్రమాదం ఉంది కాబట్టి గింజలు బాగా ఆరే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని తప్పడగింజలు, పొట్టు వంటివి మంచి గింజలతో కలవకుండా ఖచ్చితంగా జాగ్రత్తపడాలని హెచ్ ఓ సూచించారు. హెక్టారుకు సుమారు 7 నుండి 10 క్వింటాళ్ళు దిగుబడి వస్తుందని క్వింటా గింజల ధర సుమారు 60,000 ఉంటుందని ఉద్యానవన అధికారిణి రిని తెలిపారు.



## ప్రతి సోమవారం-ప్రజా సమస్యల పరిష్కార వేదిక...



**దేవీపట్నం,పెన్ పవర్,మార్చ్17:** మండలంలో ప్రతి సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా

### దేవీపట్నం తహశీల్దార్ సత్యనారాయణ...

సమస్యల పరిష్కార వేదిక (పిఆర్.జి.ఎస్) కార్యక్రమం నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్,ఆదేశాలు జారీ చేశారని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారని దేవీపట్నం తహసిల్దార్ కే.సత్యనారాయణ పత్రిక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ప్రజల యొక్క దయనందిన సమస్యల పరిష్కారార్థం కోసం అత్యంత ప్రతిష్టగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక.దేవీపట్నం మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాతృశ్రీ గుబ్బాలమ్మవారి జాతరకు ముహూర్తపు రాట

**గోకవరం పెన్ పవర్ మార్చి 17 :** గోకవరం గ్రామదేవత మాతృశ్రీ గుబ్బాలమ్మవారి జాతరమహొత్సవాలకు సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ముహూర్తపు రాట వేశారు.ఈనెల 30వ తేదీ నుండి ఏప్రియల్ 3 వ తేదీ వరకు జాతర మహొత్సవాలు నిర్వహించనున్నారు.ముహూర్తపు రాట కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఆచంట రాజు,గండ్రెడ్డి సన్యాసిరావు,ముమ్మిడివరపు నారాయణరావు,గున్నూరి లాజరు,యాళ్ళ శేషు, ఎలుగుబంటి అబ్బులు,మహిపాల రాము, ముప్పిడి నాగేశ్వరరావు, మామిడి సత్యనారాయణ గొండేటి కోటేష్, బండి మణి తదితరులు ఉన్నారు.



## పది పరీక్షలకు పదిమంది గైర్హాజరు

**గోకవరం పెన్ పవర్ మార్చి 17:** మండలంలో ప్రారంభమైన పది పరీక్షలకు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ బి గౌరమ్మ తెలిపారు. గోకవరం జిల్లాపరిషత్ హైస్కూలు, కామరాజుపేట జిల్లాపరిషత్ హైస్కూలు రంపఎర్రంపాలెం జిల్లాపరిషత్ హైస్కూలు,ఏపీఆర్ఎస్ భూపతిపాలెం హైస్కూలు, వీర్లంకపల్లి గురుకుల పాఠశాలల నందు పరీక్షలు నిర్వహించినట్లు, మొదటిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు మొత్తం 748 విద్యార్థులకు గాను 738 మంది విద్యార్థులు హాజరైనట్లు పదిమంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

## పదవతరగతి పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరు

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** జగ్గంపేట మండలంలో సోమవారం మొదలైన పదవ తరగతి పరీక్షలకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ఆర్.స్వామి తెలిపారు. జగ్గంపేట మండలంలో జగ్గంపేట హైస్కూల్, కాట్రావులపల్లి హైస్కూల్, శ్రీచైతన్య, భాష్యం, స్వామివివేకానంద స్కూల్స్ లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 1127మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1118 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

## వందశాతం పన్నులు వసూలు చేసిన కార్యదర్శికి అభినందనలు



**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, మార్చి 17:** 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ప్రభుత్వం పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో గండేపల్లి మండలంలో సింగరంపాలెం గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వెంకటరామనాథ్ పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ వందశాతం పన్నులు వసూలు చేశారు. ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను, కుళాయి పన్ను కట్టించుకున్నారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లలో చురుగ్గా వ్యవహరించి 100 శాతం పూర్తిచేసిన కార్యదర్శి వెంకటరామనాథ్ కు గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జి అభినందనలు తెలిపారు. కార్యదర్శి వెంకటరామనాథ్ ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్క కార్యదర్శి కూడా తమ తమ గ్రామాల్లో పన్నుల వసూళ్లపై పూర్తిస్థాయి దృష్టి సారించి వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీవో సూచించారు. అలాగే కార్యదర్శి వెంకటరామనాథ్ ను గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు అభినందించారు.

## వాసవి క్లబ్ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** స్థానిక కాకినాడ రోడ్ లోని బాలాజీ జ్యువెలర్స్ ఎదురుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రతిరోజు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారం కొత్త కృష్ణ చైతన్య సౌమ్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీకి ఆర్థిక సహాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాసవి గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, కంచర్ల సత్యనారాయణ, బోండా వీరసత్య, దారా శ్రీనివాస్, వి.నాగసత్య, ముమ్మడివరపు సురేష్, పొట్టి వీర్రాజు, మానేపల్లి రామానుజ, మాతం శెట్టి నారాయణ, లావణ్య, ఉద్ధగిరి కామేష్, నెట్టల శ్రీనివాస్, నాగలక్ష్మి, మతంశెట్టి కిషోర్, బద్ది సురేష్, వాసవి, వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ లో పేదలకు అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 17:** స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్నా క్యాంటీన్ లో సోమవారం అన్నదానం చేశారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన స్వర్గీయ పంతం కృష్ణారావు కుమారులు పంతం సత్యనారాయణ, పంతం రాజా ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నా క్యాంటీన్ ను కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, కన్నబాబు, అడపా భరత్ బాబు, దొడ్డిపట్ల బుజ్జి, దేవరపల్లి మూర్తి, దాసరి సీతారామకృష్ణ, బోదిరెడ్ల సుబ్బారావు, బద్ది సురేష్, ఎస్ వి ప్రసాద్, పాలాడి శ్రీను, కోడూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు




**ఆలమూరు,పెన్ పవర్,మార్చి 17:**2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ఆలమూరు మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ 1 బి అప్పాజీ తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మొత్తం 684 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 682 మంది హాజరయ్యారన్నారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. తొలి పరిక్ష కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలు చేశారు.పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు స్మార్ట్ ఫోన్, స్మార్ట్ వాచీలు, ఇతర ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలకు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. అలాగే వేసవికాలం దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించి, పరీక్ష పూర్తయిన అనంతరం జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్ లో డిపాజిట్ చేసేంతవరకు పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్ సౌకర్యం కల్పించారు.

# రంపచోడవరం నుండి గోకవరం జగ్గంపేట మీదుగా విశాఖపట్నం బస్సు నడపాలి




**గోకవరం పెన్ పవర్ మార్చి 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం , గోకవరం మండల ప్రజల సౌకర్యార్థం రంపచోడవరం నుంచి గోకవరం,జగ్గంపేట మీదుగా విశాఖపట్నం వరకు బస్ సర్వీస్ నడపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. విశాఖపట్నం వెళ్లేందుకు రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణించవలసి వస్తుందని దీంతో అదనపుసమయం,అదనపు ఛార్జీల భారం వెచ్చించాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. ఈ ప్రాంతం నుండి నిత్యం విశాఖపట్టణానికి విద్యార్థులు ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు అదేవిధంగా వైద్యం కొరకు ఆస్పత్రులకు ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకొని రంపచోడవరం నుండి గోకవరం జగ్గంపేట మీదుగా విశాఖపట్నం వరకు బస్ సర్వీస్ ను నడపాలని డిపో మేనేజర్ ను ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# దోమల నివారణపై ఒకేసారి ఫాగింగ్ చేయాలి

- దిశ కమిటీ సభ్యుడు నందమూరి వినోద్



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17:** కాకినాడ నగరంలో అపారిశుద్ధ్యం తాండవిస్తోందని అందువల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయని కాకినాడ దిశ జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి వీర వెంకట వినోద్ సోమవారం కాకినాడలోని గ్రీవెన్స్ కార్యక్రమంలో డిఆర్వో జే. వెంకటరావుకు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ సుమారు నెలరోజుల క్రితం నగరపాలక సంస్థ కమిషనర్ భావనకు వినతి పత్రాన్ని అందించినట్లు చెప్పారు. తిరిగి ఆ సమస్యపై జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు అందించానన్నారు. దోమలు పెరగడం వల్ల దోమకాటుకు గురై కాకినాడ ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని వినోద్ తెలిపారు. దోమల నివారణకు నగరంలోని అన్ని డివిజన్లో ఒకేసారి వారం రోజులపాటు ఫ్యాగింగ్ నిర్వహిస్తే చాలావరకు దోమలను అరికట్టవచ్చున్నారు. ఇల్లుతో పాటు బయట ఎక్కడా దోమల వల్ల ఉండలేని పరిస్థితి కాకినాడ నగరంలో నెలకొందని వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే లెట్రిన్ గొట్టాలకు నెట్ల కట్టడం, మురికి కాలువలో ఆయిల్ బాల్స్ వేయడం, చెరువుల్లో గంబుషియా చేప పిల్లలను పెంచడం, ఫినాయిల్, బ్లీచింగ్ వంటివి చల్లి పారిశుధ్యం మెరుగ్గా నిర్వహిస్తే దోమలు బాధ తగ్గుతుందని డిఆర్ఓ వెంకట్రావుకు వినోద్ చెప్పారు.ఈ కార్యక్రమంలో వినోద్ వెంట గుండ్రోజు ఉదయ బానోజీరావు, పబ్బినీడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ను కలిసిన దేవీపట్నం సర్పంచ్ రాజమణి...



**దేవీపట్నం,పెన్ పవర్,మార్చ్17:**
దేవీపట్నం మండలంలో పోలవరం ప్రాజెక్టులో ముంపున గురైన 44 గ్రామాల నిర్వసితుల సమస్యలను ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయంలో సోమవారం పోలవరం అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ ని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి దేవీపట్నం మండల తెలుగు యువత అధ్యక్షులు లంక హరిచంద్రుడు దేవీపట్నం గ్రామ నిర్వాసితులు కలిసి సమస్యలను వివరించారు.దేవీపట్నం గ్రామానికి సంబంధించి కోర్టులో ఉన్న 9 ఎకరాలు నిరసితులకు అప్పగించి గృహ నిర్మాణం చేపట్టాలని 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్.అండ్.ఆర్ ఇవ్వాలని గిరిజన గిరిజనేతర రైతుల భూమికి నష్ట పరిహారం అలాగే భూమికి భూమి సమస్యలను పరిష్కారం చేయాలని 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులకు అర్హుల జాబితాలో చేర్చాలని పునరావస కాలనీలో స్మశాన వాటికలు మండలంలో సుమారు 1200 మంది అర్హులైనప్పటికీ చిన్నచిన్న కారణాలు చూపిస్తూ అనర్హులగా అధికారులు చూపిస్తున్నారని తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు సమస్య పై స్పందించిన ఆయన దేవీపట్నం 9 ఎకరాలు కోర్టులో రిట్ వేసామని త్వరలోనే నిర్వాసితుల కు గృహ నిర్మాణం చేపడతామని జిల్లా కలెక్టర్ పునరవస కాలనీ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమం దేవిపట్నం గ్రామ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య కళాశాల విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ పై సెమినార్




**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :**స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెస్సీ విద్యార్థులకు చిరల్ సింతసిస్ – రీసెర్చ్ మెథడాలజీ పై సెమినార్ నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.ఆదిత్య డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో చిరల్ సింతసిస్ – రీసెర్చ్ మెథడాలజీ పై సెమినార్ జరిగింది.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ నాయుడు మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు నూతన అంశాలను తెలుసుకోవాలని, పరిశోధన రంగంలో ఉత్తమ స్థితిని పొందాలని అన్నారు.ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన అదికవి నన్నయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర బోర్డు అఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బి జగన్మోహన్ రెడ్డి చిరల్ సింతసిస్ – రీసెర్చ్ మెథడాలజీ పై అవగాహన కల్పించారు. ప్రయోగశాలలో విద్యార్థులు నేర్చుకోవాల్సిన అంశాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.ఈ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కెమిస్ట్రీ విభాగాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, కెమిస్ట్రీ విభాగాధిపతి కె. సురేష్ కుమార్ , అధ్యాపకులు వి సోమేశ్వరరావు, కె.నాగు,కె.వీరబాబు,బి.దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# శాలిపేట గర్ల్స్ హైస్కూల్ కు 25000 విలువచేసే ఇన్వర్టర్లు విరాళం



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :**స్థానిక శాలిపేట బాలికోన్నత పాఠశాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ కాకినాడ వారు సోమవారం 25 వేల రూపాయలు విలువ చేసే రెండు ఇన్వర్టర్ లను విరాళంగా అందించారు.అదే విధంగా హెచ్.ఎం.రూమ్, స్టాఫ్ రూమ్ లకు కనెక్షన్ ఇప్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని జే. సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించేందుకు వివిధ సంస్థలు ముందుగా రావడం హర్షనీయమని అన్నారు.దీనిని స్ఫూర్తిగా తీసుకొని వివిధ స్వచ్ఛంద సంస్థలు సేవా సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలని తద్వారా పాఠశాల అభివృద్ధికి తమ సహకారాన్ని అందించాలని అన్నారు.ఈ సందర్భంగా ఇన్వర్టర్ లను అందించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ కాకినాడ సీనియర్ మేనేజర్ సూర్య స్వామి,మేనేజర్లు విశ్వేశ్వరరావు స్పందన లకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ కాకినాడ శాఖ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# భారతదేశ మొదటి అంతరిక్ష యాత్రికురాలు కల్పనా చావ్లా జయంతి




**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 17:**రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం భారతదేశ తొలి అంతరిక్ష యాత్రికురాలు కల్పనా చావ్లా జయంతి నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు తెలియజేసారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కల్పన చిత్రపటం వద్ద విదార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు చావ్లా గురించి విద్యార్థులకు పలు విషయాలు వివరించారు.

అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసాలో వైస్ ప్రెసిడెంట్ హెూదాలో ఉద్యోగంలో చేరి, 1997 నవంబర్ 19 నుండి డిసెంబర్ 5 వరకు కొలంబియా అంతరిక్ష నౌకలో ప్రయాణించి, అంతరిక్షంలో ప్రయాణించిన తొలి భారతీయ మహిళగా ప్రసిద్ధికెక్కారని చెప్పారు. విద్యార్థులు ఏరో నాటికల్ ఇంజినీరింగ్ పట్ల మక్కువ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి మరియమ్మ, పేరెంట్స్ కమిటీ సభ్యురాలు సునీత, ఆయా కుమారి, మధ్యాహ్న భోజన కార్మికురాలు వరలక్ష్మి, విదార్థులు పాల్గొన్నారు.

# 200 పశువులకు టీకాలు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 17:** గాలికుంటు వ్యాధి రాకుండా 200 పశువులకు టీకాలు వేశారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను లో సోమవారం పశువుల ఆసుపత్రి వద్ద గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పశువులకు వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను పశువుల డాక్టర్లు రైతులకు తెలిపారు. అంతేకాకుండా గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నామని రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని కోరరు. 40 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతల బుచ్చిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ టీ విజయ్ కుమార్, డాక్టర్ క్రాంతి కుమార్ వెటర్నరీ అసిస్టెంట్ సతీష్, ఏ హెచ్ ఏ లు దేవిక, దుర్గ, సంజీవరావు, కూటమి నేతలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లు పై దృష్టి. ప్రత్యేక బృందాలు ఏర్పాటు.



**మండపేట. పెన్ పవర్.మార్చ్ 17 :**ఈ ఏడాది మండపేట పట్టణం లో వంద శాతం పన్ను వసూళ్ల లక్ష్యం గా పనిచేస్తున్నామని మండపేట పురపాలక సంఘం కమిషనర్ టివి రంగారావు పేర్కొన్నారు.ఇందుకోసం ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, కుళాయి పన్నులు వసూళ్ళకు సంబంధించి సంబంధిత ఆఫీసు సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులతో కలిసి వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు.పన్నులు చెల్లించాలని ప్రకటన బోర్డులను ముఖ్య కూడలిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద కాలువ వద్ద, రాజారత్న జంక్షన్, ఎన్.టి.ఆర్ జంక్షన్, మున్సిపల్ ఆఫీసు, కృష్ణ కళ్యాణి జంక్షన్లలో బోర్డు లు ఏర్పాటు చేశారు. రెవిన్యూ ఆఫీసర్ జె.వి.యస్.శాస్త్రి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. సత్తిరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్, మేనేజరు కె. హరిమోహన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. శ్రీ రమ్య, అసిస్టెంట్ ఇంజనీర్లు డి. పవన్ కుమార్, బి.ఆంజనేయులు ఆర్.ఐలు ఎ.జె.ఎన్ శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాసరావు, సీనియర్ జూనియర్ అసిస్టెంట్ లు (సూపర్ వైజర్లు) వార్డు సచివాలయ కార్యదర్శులు, కంప్యూటర్ సిబ్బంది పాల్గొన్నారు.

# అశోక్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో ఉచిత మెగా వైద్య శిబిరం





**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి 17:**
అశోక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 2500 రూపాయలు విలువ చేసే వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. నిపులైన డాక్టర్ల పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్య పరీక్షలు చేయించుకొని ఉచిత సేవలు పొందడం జరిగింది. ఈ నేపథ్యంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.అశోక్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో 207 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. హాస్పటల్లో జనరల్ మెడిసిన్, అర్థోపెడిక్స్ చూడబడునని పేర్కొన్నారు. అదేవిధంగా రాబోయే కాలంలో ప్రజలకు అందుబాటులో ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో డాక్టర్ ఏ.కిషోర్ కుమార్, డాక్టర్ బి.లక్ష్మి అమూల్య, హాస్పటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కిర్లంపూడి మండలంలో 10 వ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతం

-ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు.

**కిర్లంపూడి,పెన్ పవర్, మార్చి 17:** కిర్లంపూడి మండలంలో ప్రారంభమైన 10 వ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు టి జోసెఫ్, మక్కా చిన్నారావులు తెలిపారు. మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన రెండు పరీక్షా కేంద్రాలతో పాటు జగపతినగరం ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలోనూ, గెద్దనాపల్లి,బూరుగుపూడి,తామరాడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లోను 917 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 910 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలు హాజరయ్యారన్నారు.ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ లు, టి జోసెఫ్, మక్కా చిన్నారావులు తెలిపారు.





# మండలంలో ప్రశాంతంగా పది పరీక్షలు





- పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఈవో
- తొలిరోజు పరీక్షకు నూరుశాతం హాజరు

**కాజులూరు,పెన్‌పవర్,మార్చి17:** మండల పరిధిలోని సోమవారం ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.మండలంలో కుయ్యేరు, కాజులూరు, గొల్లపాలెం పరీక్షా కేంద్రాల మొత్తం 594 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాజరు కావాల్సి ఉండగా, తొలిరోజు పరీక్షకు నూరు శాతం విద్యార్థులు హాజరయ్యారని కాజులూరు మండల విద్యాశాఖాధికారి డి.డేవిడ్ రాజు తెలిపారు.ఉదయం 9.30 గంటలకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ,అర్ధగంట ముందే పరీక్షా కేంద్రాలకు విద్యార్థినీ,విద్యార్థులు హాజరయ్యారు. గొల్లపాలెం పరీక్షా కేంద్రాన్ని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు.కాజులూరు పరీక్షా కేంద్రాన్ని తహశీల్దార్ జి.ఠాగూర్ సందర్శించి,ఏర్పాట్లను పరిశీలించారు. కాజులూరు పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసి వచ్చిన విద్యార్థినీ,విద్యార్థులను పెన్ పవర్ ప్రతినిధి పేపరు ఎలా ఉందని వివరాలు అడిగితెలుకోగా, తెలుగు పేపరు చాలా బాగుందంటూ విద్యార్థులు సతోషం వ్యక్తం చేశారు.12.45 నిమిషాలకు విద్యార్థులు బయటకు వచ్చేందుకు గేటు తెరిచేశారు.ఇదిలా ఉంటూ మధ్యాహ్నం క్లాస్‌లకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు అదేసమయానికి వచ్చి ఫేస్ యాప్ హాజరు వేసుకునేందుకు కాస్త ఇబ్బందిపడ్డారు.వీరితోపాటుగా స్కూల్ విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు స్కూల్ గేటు ఎదుట వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది.పరీక్షా కేంద్రాలవద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది తలత్తకుండా అధికారులు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఆశ్రమ పాఠశాల శానిటేషన్ వర్కర్లు
- ఐటీడీఏ ముందు ఆందోళన చేపట్టారు.




**చింతూరు పెన్ పవర్ మార్చి 17:** ఆశ్రమ పాఠశాల శానిటేషన్ వర్కర్లు ఐటీడీఏ ముందు ఆందోళన చేపట్టారు.
సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల కళాశాలలో పనిచేస్తున్నటువంటి శానిటైజర్ వర్కర్లకు కనీస వేతనం, ప్రమాద బీమా సౌకర్యం, ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించి, మూడు నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించాలి అని అన్నారు. పని భారాన్ని తగ్గించి పనిచేస్తున్న క్రమంలో శానిటేషన్ వర్కర్లకి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. గత ప్రభుత్వంలో ఈ శానిటేషన్ వర్కర్స్ ని తీసుకోవడం జరిగింది, అలానే ఈ కూటమి ప్రభుత్వం కూడా శానిటేషన్ వర్కర్లకి కనీస వేతనం ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శానిటేషన్ వర్కర్ల అందరితో మహా ధర్నా కార్యక్రమం చేపడతామని కూటమి ప్రభుత్వానికి హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినీతి పత్రానికి ఏవో కీ అందజేశారు. ఏవో మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్ల సమస్యలు నాపై అధికారులకి తెలియజేసి వారితో పాటు కూటమి ప్రభుత్వానికి తెలియపరుస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటైజర్ వర్కర్లు సుజాత, విజయ, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు జవాబుదారీతనంతో అధికారులు పరిష్కరించాలి -కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత



**కొవ్వూరు, పెన్ పవర్, మార్చి 17:** ప్రజల సమస్యలు జవాబుదారీ తనంతో అధికారులు పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. సోమవారం ఉదయం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి "పి జి ఆర్ ఎస్ మీ కోసం" లో ప్రజల నుంచి నాలుగు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రాణి సుస్మిత మాట్లాడుతూ డివిజన్ స్థాయి అధికారులు అందరూ ఒకే వేదికపై ప్రజలకి అందుబాటులో ఉండి అర్జీలు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ప్రజల సమస్యల పరిష్కారం మరింత వేగవంతం చేసే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చాగల్లు మండలానికి చెందిన సుంకవల్లి శ్రీనివాసరావు నా స్థలం ఆక్రమణకు గురైందని, కావున నా స్థలం నాకు ఇప్పించమని, ప్రాణ రక్షణ కల్పించమని అర్జీ సమర్పించుకున్నారు. కొవ్వూరు మండలం, తోగుమ్మి గ్రామానికి చెందిన వి.విజయ్ ఆక్రమించుకున్న నా స్థలాన్ని ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17:** విజయవాడ శ్రీ సరళ దేవి కళ్యాణమండపంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే టైక్వాండో కుంగ్ ఫూ పోటీలలో ఆలమూరు శ్రీ సిద్ధార్థ విద్యార్థుల అత్యంత ప్రతిభ కనబరిచినట్లు మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు తెలిపారు. వివరాలు ప్రకారం టైక్వాండోలో ప్రతిభ బ్రౌన్ బెల్ట్ కటాస్ (ఏ) విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్ గోల్డ్ మెడల్,బ్లూ బెల్ట్ విభాగంలో జి.షణ్ముఖ గోల్డ్ మెడల్, సాధించగా ఎల్లో బెల్ట్ (బి) విభాగంలో బండి దైవీక్ ఆశీష్ గోల్డ్ మెడల్,బ్రౌన్ బెల్ట్ (బి) విభాగంలో కొత్తూరు సెంటర్ ప్రభుత్వ హై స్కూల్ కి చెందిన విద్యార్థి బుంగ అశ్విన్ గోల్డ్ మెడల్, ఎల్లో బెల్ట్ (బి)విభాగంలో జి సత్య మోహన్ మణికంఠ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ఈ మేరకు వీరిని శ్రీ సిద్ధార్థ హై స్కూల్ అధినేత కె ముల్లారావు,ప్రిన్సిపాల్ ఏ ఇందిరా నిర్మల,కోచ్ టి.వెంకటలక్ష్మి,పాఠశాల ఉపాధ్యాయులు,కిక్ బాక్సింగ్ కోచ్ టి లక్ష్మీ,సందీప్,కిరణ్,తదితరులు విద్యార్థులను అభినందించారు.

## ప్రశాంతమైన వాతావరణంలో పదో తరగతి పరీక్షలు



ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 17 :** ఏజెన్సీలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం కలిగించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రంపచోడవరం ప్రభుత్వ హైస్కూల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈనెల 17వ తారీఖు నుండి ఈనెల 31 వ తారీకు వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఏజెన్సీలో అన్ని పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు మంచి వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా వెలుతురు,ఫ్యాన్లు, త్రాగునీరు ఎక్కడికి అక్కడ ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీలో పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగా సంబంధిత పరీక్ష కేంద్రాలకు సకాలంలో హాజరు అవ్వాలని ఆయన అన్నారు. ఏజెన్సీలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల కమిటీని రద్దు చెయ్యాలి

కమిటీ ఆర్థిక కార్యకలాపాలపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్..



**ఆలమూరు, పెన్ పవర్,మార్చి17:** ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీని వెంటనే రద్దు చేసి ఆ కమిటీ ఆర్థిక కార్యకలాపాలపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై వారి ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నల్లిమిల్లి సురేష్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. 25 ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న భవనంలో కళాశాలను కొనసాగిస్తున్నప్పటికీ అభివృద్ధి పనులు జరగలేదన్నారు.ఇన్ని సంవత్సరాలుగా కాలేజి స్థలం ప్రయివేటు వ్యక్తుల చేతిలో ఆక్రమణలకు గురైనప్పటికీ కమిటీ సభ్యులు స్పందించలేదన్నారు. అలాగే కళాశాల ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు.విద్యార్థుల తరపున కమిటీ వారు ఫీజులు కట్టడం, కళాశాలలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్టు చెప్పారన్నారు. వాటి అన్నింటికీ కమిటీ పేరుతో ఏదైనా బ్యాంక్ అకౌంట్ నిర్వహిస్తున్నారా? ఉంటే లెక్కలు చూపించాల్సిందిగా కోరారు. అదేవిధంగా 9 కోట్ల రూపాయిలు కాలేజి అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించినట్లు కమిటీ వారు 2024 సం.లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులకు తెలియజేశారన్నారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి అభివృద్ధి పనులు మొదలుకాలేదని, ఆ నిధి ప్రభుత్వం నుండి ఎవరికి అందింది, అస్సలు ఆదాయం ఉందో లేదో తెలియపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మాటలతో , అబద్ధపు ప్రమాణాలు చేశారని, కమిటీ వారు విద్యార్థులకు వివరణ ఇవ్వాలన్నారు. విచారణలో తప్పులు ఉన్న యెడల కమిటీ సభ్యులపై తగు చర్యలు తీసుకుని, కమిటీని రద్దు చేసి నూతన కమిటీ ఎన్నుకొని,ఆ కమిటీలో పూర్వ విద్యార్థుల తల్లి తండ్రులకు అవకాశం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐఎస్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ సతీశ్, జాయింట్ సెక్రటరీ సందీప్ పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పిలుపు శిరోధార్యం



కాకినాడ సిటీ జనసేనపార్టీ కార్యదర్శి దారపు శిరీష

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :** అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభ ముగింపు సందర్భంగా పవన్ కళ్యాణ్ తన ప్రసంగంలో సభా వేదికను శుభ్రం చేయడానికి శానిటేషన్ సిబ్బందికి జన సైనికులు,వీరమహిళలు సహకరించాలని ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛ కార్యక్రమాన్ని సభ వేదిక వద్దే నిర్వహించినట్లు కాకినాడ సిటీ జనసేనపార్టీ కార్యదర్శి దారపు శిరీష తెలిపారు. శనివారం ఉదయమే సభా స్థలికి చేరుకుని కాకినాడ సిటీ మహిళా సహాయ కార్యదర్శి మిరియాల హైమావతి,జనసేన పార్టీ శానిటేషన్ కమిటీ సభ్యులు మావులూరి సురేష్,చీకట్ల శ్రీనివాస్ తో కూడిన బృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.



## సహనం ఇస్లాం సందేశం.

- ఎస్ఐ ఓ ఐ వై ఏం ఆధ్వర్యంలో.
- ఇఫ్తార్ విందు.



**మండపేట. పెన్ పవర్.మార్చ్ 17:** మండపేట గాంధీనగర్ అల్-ఆమీన్ మస్జిద్ లో ఎస్ ఐ ఒ , ఐ వై ఏం ఆధ్వర్యంలో ఆత్మీయ మిత్రులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో రావులపాలెం జమాఅతె ఇస్లాం హింద్ అధ్యక్షులు పాల్గొన్నారు. రమాజన్ నెల విశిష్టతను తెలియజేశారు. ఖుర్ఆన్ సర్వమానవాళి కోసం ఆవతరించిన గ్రంధమని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ముస్లిం యువకులు నిర్వహించిన ఇలాంటి ఇఫ్తార్ విందు సుహృద్భావ వాతవరణానికి ప్రతీకగా నిలుస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఒ జిల్లా బాధ్యులు షుఐబ్, స్థానిక అధ్యక్షులు తల్హా, ఐ వై ఏం స్థానిక అధ్యక్షులు అబ్దుల్ హమీద్, కులమతాలకు అతీతంగా ఆధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :** కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం నందు మరియు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ ఆఫీస్ ల యందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయా అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు.కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కార్యక్రమమునకు 71 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు.ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను,సర్కిల్ కార్యాలయాలలోను,సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఎం జె వి భాస్కరరావు అదనపు ఎస్పీ (పరిపాలన)పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ పరిశ్రమను స్తంభింప చేస్తాం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 17:** బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనివార్యమైతే బ్యాంకింగ్ కార్యకలాపాలన్నీ స్తంభింప చేస్తామని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ నాయకులు టి వి సూర్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఎస్ బి ఐ మార్కెట్ యార్డ్ శాఖ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
బ్యాంకు యూనియన్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. 5 రోజుల పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో నియామకాలు చేపట్టాలని, మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. తాత్కాలిక స్వీపర్లను పర్మినెంట్ చేయాలని తెలిపారు. బాంకుల్లో పెన్షన్ రివిజన్ జరపాలని కోరారు.
ఎస్ బి ఐ అధికారుల సంఘ జోనల్ కార్యదర్శి జి. జవహర్ లాల్, యూ ఎఫ్ బీ యూ కన్వీనర్ ఎస్ ఎస్ ప్రసాద్, సి బి ఈ నాయకులు ఎం.కిరణ్ , కోఆర్డినేషన్ కమిటీ నాయకులు బి.ఏడుకొండలు, లింగంపల్లి గాంధీ,కనకారావు ప్రకాష్ కుమార్, వీరబాబు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

**గంగవరం, పెన్ పవర్, మార్చి17:** 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుండి మండలంలోని రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మోహనాపురం, కొత్తాడ, గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల లు, కొత్తడ కస్తూరిబా బాలిక విద్యాలయం, వేములోవ గంగవరం ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు రంపచోడవరం మండలం నల్లగొండకు చెందిన విద్యార్థులు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ప్రత్యేక అధికారి ఎంపీడీవో లక్ష్మణరావు, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం లో ప్రత్యేక అధికారిని సిడిపిఓ లక్ష్మి ఆధ్వర్యంలో తొలి రోజు నూరు శాతం హాజరుతో విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి మాస్ కాఫీ జరగకుండా ఏడాది ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు దీనిపై విద్యార్థులు తల్లిదండ్రులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల నిర్వహణకు ఎంఈఓ మల్లేశ్వరరావు పర్యవేక్షించగా, గంగవరం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## అన్నవరం-బాపట్ల మధ్య కోస్టల్ రైల్వే కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- లోక్ సభ లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ డిమాండ్.
- సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే శాఖ.



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 17 :** కాకినాడ జిల్లా అన్నవరం నుండి బాపట్ల వరకు కోస్టల్ రైల్వే కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. సోమవారం లోక్ సభలో రైల్వే శాఖ డిమాండ్స్ ఫర్ గ్రాండ్స్ పై జరిగిన చర్చలో భాగంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 947 కి. మీ సుదీర తీర ప్రాంతం,భారీ ఎగుమతులతో ప్రధాన పోర్టులు ఉన్నప్పటికీ రైల్వే కారిడార్ లేకపోవడం వల్ల వాణిజ్యం, లాజిస్టిక్స్ తో పాటు ప్రాంతీయ పోర్టుల అనుసంధానం లో ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు.దీన్నిఅధిగమించేందుకు ఆంధ్రప్రదేశ్ లో కాకినాడ, మచిలీపట్నం,నిజాంపట్నం ఓడ రేవులను అనుసంధానం చేస్తూ త్వరితగతిన కోస్టల్ కారిడార్ ఏర్పాటు చేస్తే సరుకు రవాణా సులభతరం అవ్వడంతో పాటు వ్యవసాయరంగం,సీ ఫుడ్స్ ఎగుమతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కేవలం 30 కి. మీ కొత్త రైల్వే ట్రాక్, తక్కువ పెట్టుబడితో కోస్టల్ కారిడార్ పూర్తయ్యే అవకాశం ఉందని తద్వారా కాకినాడ వాసుల చిరకాల వాంఛ అయిన రైల్వే మెయిల్ లైన్ డిమాండ్ కూడా నెరవేరుతుందని, అలాగే కారిడార్ పూర్తయితే బొగ్గుపై ఆధారపడడం తగ్గడంతో పాటు, రైల్వే సరుకు రవాణా సులభతరం అవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి,వికసిత్ భారత్ 2047 ను దృష్టిలో ఉంచుకొని కేంద్ర రైల్వే శాఖ చొరవ తీసుకొని కోస్టల్ కారిడార్ ప్రాజెక్ట్ పై త్వరితగతిన అధ్యయనం చేయాలని కోరారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషితో కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు చేయడంతో పాటు, రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్, రైల్వే బడ్జెట్లో ఏపీకి అత్యధికంగా 9, 417 కోట్లు కేటాయింపులు చేయడం పట్ల ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మొదటి రోజు పరీక్షకు ఇద్దరు ఆబ్సెంట్



**వై రామవరం,పెన్ పవర్, మార్చ్ 17 :** పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ఇద్దరు విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని ఎంఈఓ 2 వెంకటరమణ తెలిపారు.

మండలంలో డొంకరాయి పరీక్షా కేంద్రంలో ఒకరు, యార్లగడ్డ పరీక్ష కేంద్రంలో ఒకరు మొదటి రోజు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. డొంకరాయి పరీక్షా కేంద్రంలో 66 మంది విద్యార్థులకు గాను 65 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. అదేవిధంగా యార్లగడ్డ జి టి డబ్ల్యూ ఏ జి హెచ్ ఎస్ పరీక్షా కేంద్రంలో 164 విద్యార్థులకు గాను, 163 మంది హాజరయ్యారని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకరాయి నుండి ఒకరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వై. రామవరం నుండి ఒకరు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని అన్నారు.

## పాము కాటుకు గురైన పదవ తరగతి విద్యార్థి పరీక్ష వ్రాశాడు..



**అనపర్తి,పెన్ పవర్,మార్చి 17**

పాము కాటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 10వ తరగతి పరీక్ష రాశాడో విద్యార్థి. రాజానగరం మండలం శ్రీకృష్ణ పట్టణానికి చెందిన వై నిస్సి అనపర్తి మండలం లక్ష్మీ నరసాపురం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. పదో తరగతి పరీక్షలు సమీపించడంతో శనివారం సాయంత్రం ఓ చెట్టు కింద కూర్చొని చదువుకుంటూ పక్కనే ఉన్నవో రాయి కింద వేలు దూర్చాడు. దీంతో అతని వేలును ఏదో కుట్టినట్లుగా అవడంతో కేకలు పెట్టాడు. రాయి పక్కకి తీసి చూడగా రాయి కింద తాచుపాము కనిపించింది. అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. కాగా ఆరోగ్యం నిలకడగా ఉందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. మూడు రోజులపాటు ఆసుపత్రిలో పరిశీలనలో ఉంచి డిస్చార్జ్ చేస్తామని వైద్యులు చెప్పారు. అయితే సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అవడంతో ఆసుపత్రి నుంచే ఉదయం నేరుగా లక్ష్మీ నరసాపురం లోని పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్ష రాశాడు. ఓ పక్క చికిత్స పొందుతున్న ధైర్యాన్ని వీడకుండా పరీక్ష రాసిన నిస్సిని పలువురు ప్రశంసించారు. పరీక్ష అనంతరం ఆసుపత్రికి వెళ్లనున్నట్లు ఆ విద్యార్థి తెలిపాడు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సింహాచలం
- సబ్ కలెక్టర్ కల్పశ్రీ



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ,మార్చి 17 :** ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కార మార్గాల అన్వేషించి సమస్యలు పరిష్కారం కొరకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరము ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కలపశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ నిర్వహించారు. ఈసందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈవారం 82 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి దరఖాస్తుదారుల అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవీ పట్టణ మండలం నేల దోనెలపాడు గ్రామంలోని 400 ఎకరాల చెరువు (ఆవ) కు 56 కుటుంబాలు చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నామని అదేవిధంగా 1987 సంవత్సరంలో మా గ్రామానికి సంబంధించిన గిరిజనులము సొసైటీ రిజిస్ట్రేషన్ కూడా చేయడం జరిగిందని అదేవిధంగా ఈ 400 ఎకరాల ఆవకు రాజమండ్రి రూడా వారు టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనలు చేయుచున్నారని ఈ ప్రతిపాదనలు నిలుపుదల చేసి. ఈ ఆవలో గిరిజనులము సొసైటీ ద్వారా చేపలు పట్టుకొని జీవనం సాగించే విధంగా మాకు అవకాశం కల్పించాలని తుంబుడు పోతిరెడ్డి, వలల రామకృష్ణారెడ్డి, చదల దుర్గారెడ్డితో పాటు 50 మంది గిరిజనులు దరఖాస్తు సమర్పించారు. దేవీపట్నం మండలంలోని శరభవరం పంచాయతీలోని 8 గ్రామాలకు ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు, త్రాగునీరు ఏర్పాటు చేయాలని మడకం శ్రీనివాసరావు దొర, కుంజం తాతాజీ దొర, కొమరం నాగబాబు దొర దరఖాస్తు సమర్పించారు. వై. రామవరం మండలం మంగంపాడు గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన భవన పనులు ప్రారంభించి మధ్యలో నిలిపి వేయడం జరిగిందని వెంటనే పీహెచ్సీ భవన పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయాలని సారం కోట అబ్బాయ్ రెడ్డి, నైని లచ్చిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం మంగంపాడు పంచాయతీలోని పివి టీజీలకు గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేసి పక్క నివాసగృహాలు ఏర్పాటు చేయాలని నైని. లచ్చిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. అడ్డతీగల మండలం భీముడుపాకల గ్రామంలోని. నాకు సంబంధించిన భూసమస్య పరిష్కరించాలని జి. అత్యాయమ్మ దరఖాస్తు సమర్పించారు. ఈకార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం. రుక్మాండయ్య, రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడియం%డ%హెచ్ఓ జి.శిరీష, డిఎల్డిఓ కె. కోటేశ్వరరావు,ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ వెంకట ఇందిర, డి ఎల్ పి ఓ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, తాసిల్దార్ పి.రామకృష్ణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, పి హెచ్ ఓ కె. చిట్టిబాబు, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏ సిహెచ్ కెవి చౌదరి, వెలుగు డిపిఎం అపర్ణ, ఏయంఓ విజయభాస్కర్, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, సుబ్బారావు, శ్రీనివాసరావు,డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, డిడి ఆఫీస్ సూపర్డెంట్ బి.కిషోర్, తదితరులు పాల్గొన్నారు,

# అవినీతి సొమ్ము రికవరీ చేయాలి

**అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బొలిశెట్టి**



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 17:**రైతుల సొమ్మును బొక్కిన రాజకీయ రాబందులో నుండి రికవరీ చేయాలని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బొలిశెట్టి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల సొమ్ము దుర్వినియోగం అయిందని తెలిపారు. కోపరేటివ్ బ్యాంకులు గడిచిన ఐదు సంవత్సరాల్లో త్రీ మేన్ కమిటీ వేశారని, ఆ సమయంలో ఉన్న శాసనసభ్యులు, అధికారులు రైతులు దోచుకున్నారని ప్రస్తావించారు. పశ్చిమగోదా వరి జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయగా కమిషన్ 40 కోట్ల రూపాయల వచ్చాయని తెలిపారు.

గడిచిన ఐదేళ్లలో ఆ నగదు రైతులకు డివిడెండ్ల రూపంలో చేరలేదని వివరించారు. ఎవరైనా రైతు ఇంటిలో మరణం కానీ కష్టంగాని సంభవిస్తే ఆ నగదు వారికి ఇచ్చే విధంగా ఒక రూల్ పాస్ చేస్తే బాగుంటుందని ఆయన తన అభిప్రాయాన్ని అసెంబ్లీలో వ్యక్తం చేశారు. కచ్చితంగా ఆ సమయంలో ఉన్న రాజకీయ నాయకులు, అధికారుల వద్ద కూడా డబ్బు రికవరీ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

కోట్లాది రూపాయలు ప్రభుత్వం నుండి కమిషన్ వచ్చిన నగదు కూడా స్థానిక ఎమ్మెల్యేలు అధికారులు పంచుకున్నారని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం లోని పెంటపాడు మండలం లో రెండు సొసైటీలు అవినీతి జరిగిందని ప్రస్తావించారు. కోరుమిల్లి సొసైటీలో 70 లక్షల రూపాయలు అవినీతి జరిగిందని వెల్లడించారు. అదేవిధంగా దర్శిపర్రు సొసైటీలో అవినీతి జరిగిందని ఇప్పటికి కూడా ఆ సొసైటీపై విచారణ జరగలేదని బొలి శెట్టి తెలిపారు. త్వరితగతిన విచారణ చేసి రైతులు సొమ్ము ఎవరైతే మింగారో వారి వద్ద నుండి ఆర్ఆర్ యాక్టివ్ ప్రకారం రికవరీ చేయాలని బొలిశెట్టి శ్రీనివాస్ అసెంబ్లీలో కోరారు.

# చలివేంద్రం ప్రారంభించిన తహశీల్దార్



**కాజులూరు,పెన్పవర్,మార్చి17:**మండల కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తహశీల్దార్ జి.రవింద్రనాథ్ ఠాగూర్ ప్రారంభించారు.అనంతరం మండల కార్యాలయానికి వచ్చిన సభ్యులకు తహశీల్దార్ కూలింగ్ వాటర్ అందజేశారు.ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.దాహర్తితో కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదు దారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.రానున్న రోజుల్లో ఎండ తీవ్రత ఎక్కువుగా ఉండే అవకాసం ఉన్నందున ముందుగా ఏర్పాటు చేయడజం జరిగిందని ఆయన పేర్కొన్నారు.వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

# 12వ పే కమిషన్ ఏర్పాటు చెయ్యాలి

**విశ్రాంతి ఉద్యోగులు...**



**అడ్డతీగల, పెన్ పవర్, మార్చి17:** మండల కేంద్రమైన అడ్డతీగల లో విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఉదయం అడ్డతీగల తాసిల్దార్ కే. సూర్యరావు కు వినతి పత్రం సమర్పించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ అడ్డతీగల రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ.సూర్యకాంతం. జనరల్ సెక్రెటరీ ఆకిరి.రామారావు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సభ్యులు మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ కె. సూర్యారావు కు వినతి పత్రం అందజేశారు ప్రభుత్వా%శీ% 12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని తమకు జూలై 1 తేదీ 2023 నుండి ఇప్పుడు వరకు పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయలేదని ,ప్రభుత్వము వెంటనే స్పందించి పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేసి దానికి కమిషనర్ను నియమించి తమకు రావాల్సిన ఐ ఆర్ ప్రకటించాలని వారు ఆ వినతిపత్రంలో ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మాకు రావాల్సిన డి ఆర్ బకాయిలు పిఆర్సి బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం నుండి రావలసిన పిఆర్సి బకాయిలు సొమ్ము తీసుకోకుండానే చాలామంది విశ్రాంతి ఉద్యోగులు మరణించుచున్నారని, యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత పిఆర్సి లో తగ్గించిన ఎడిషనల్ క్వాంటం పెన్షన్ పూర్వ పద్ధతిలో 70 సంవత్సరాలు నిండిన వారికి 10 శాతం అలాగే 75 సంవత్సరాల నిండిన వారికి 15 శాతం పునరుద్ధరణ చేసి ఆ బకాయిలు కూడా ఇప్పించాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు. అలాగే ఈ హెచ్ ఎస్ కార్డుపై వైద్యం చేయలేమని ప్రైవేట్ వైద్యులు చెబుతున్నారని మెడికల్ రీయంబర్స్మెంట్ వైద్యం చేయించుకోమంటున్నారని అయితే మాలో చాలామందికి ఆర్థిక వెసులుబాటు లేక చేయించుకోలేకపోతున్నామని, ఈ విషయమై ప్రభుత్వం వారు తగిన విధంగా స్పందించి ఈ హెచ్ ఎస్ కార్డు పై నగదు రహిత నగదు వైద్యము పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని, వయోవృద్ధులైన తాము మా సమస్యలను పరిష్కరించి మా జీవితాలలో వెలుగులు నింపాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ. సూర్యకాంతం, ట్రెజరర్ బాలయోగి, విశ్రాంతి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**గోపాలపురం, పెన్ పవర్, మార్చి 17.**

జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై కే సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాత్రి 10.35 గంటలుకు మృతుడు ఆయన కొవ్వూరి నాగిరెడ్డి తన ఇంటి వద్ద నుండి గోపాలపురం ప్రధాన రహదారి వెంబడి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియన వాహనం వెనుకునుండి వచ్చి కుంది. ఈ ప్రమాదంలోమృతుడు రెండు కాళ్ళుకు రక్తపు గాయాలు కాగా గోపాలపురం గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకుని వెళ్ళగా విధి నిర్వహణలో ఉన్న వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మృతుని కుమారుడు కొవ్వూరి జయంత్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సైకె సతీష్ కుమార్ కేసు నమోది చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతం.



**కె గంగవరం పెన్ పవర్ మార్చి 17:** 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి.కె గంగవరం మండలంలో 10 వ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు ఏ నాగరాజు,సిహెచ్ ఆంజనేయులు తెలిపారు.కె గంగవరం మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పామర్రు, దంగేరు, కోటిపల్లి, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు పరీక్ష కేంద్రాలలో మొత్తం 453 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా మొదటిరోజు తెలుగు పరీక్షకు 452 మంది విద్యార్థులు హాజరైనారు. ఒక విద్యార్థి హాజరు కాలేదని తెలిపారు.పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను చెకింగ్ చేసి రూములోనికి అనుమతించారు.

## బంగారం అపహరణ పై ఫిర్యాదు

**టీ నర్సాపురం,పెన్ పవర్,మార్చి 17 :**గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి బంగారం నానుతాడు లాక్కొని వెళ్ళినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కొలగాని లక్ష్మి తెలిపారు. శ్రీరామవరం గ్రామానికి చెందిన లక్ష్మీ ఆమె భర్త ద్విచక్ర వాహనంపై వెంకటాపురం కనకదుర్గమ్మ ఉత్సవాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నపు వారి గూడెం శివారులో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి ఆపి అడ్రస్ అడిగినట్లు అడిగి మా బండిని కాలితో తనగా కింద పడిపోగా మెడలోని బంగారు నానుతాడు లాక్కు వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు.





**టి.నరసాపురం, పెన్ పవర్, మార్చి17:** మండలంలో సోమవారం ప్రశాంతమైన వాతావరణం లో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనవి. మూడు పరీక్ష కేంద్రాలలో 480 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 463 మంది(96.45శాతం ) హాజరయ్యారు 17 మంది పరీక్షలకు హాజరు కాలేదు టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 179 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 175 మంది పరీక్షలు హాజరయ్యారు నలుగురు హాజరు కాలేదు బొర్రంపాలెం ఉన్నత పాఠశాలలో 226 మంది గాను 213 మంది పరీక్షలు హాజరు కాగా 13 మంది పరీక్షలు కు హాజరు కాలేదు అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాలలో 75 మంది విద్యార్థులు పరీ క్షలకు హాజరయ్యారు అని మండల విద్యాశాఖాధికారి తెలిపారు.

## మొదటి రోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం



**తాళ్ళపూడి, పెన్ పవర్, మార్చి17:**
మొదటి రోజు సోమవారం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని తాళ్ళపూడి, వేగేశ్వరపురం, మలకపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ భారతి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

## అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ ని కలిసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,మార్చి 17:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజుని అమరావతిలో సోమవారం ఇంటి వద్ద పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కలిశారు. నియోజకవర్గంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమాలపై చర్చించినట్లు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ని కలిసిన వారిలో డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు తదితరులు ఉన్నారు.

## కండక్టర్ ప్రసాద్ కథకి పురస్కారం



**గోపాలపురం, పెన్ పవర్, మార్చి 17:**మండలంలోని వేళ్ళ చింతల గూడెం గ్రామానికి చెందిన కండక్టర్ ప్రసాద్ రావు రచయితగా పలు సత్కారాలు పొందుతూనే ఉన్నారు. అందులో భాగంగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహించిన మినీ కథల పోటీలో ప్రసాదరావు రాసిన 'మానవ మృగం' కథ బహుమతికి ఎంపికైంది.ఆదివారం నెల్లూరులోని టౌన్ హాల్ లో జరిగిన సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా కౌలూరి ప్రసాదరావుకి ఘన సత్కారం చేశారు.కన్నుల పండువుగా జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీ అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు.విశిష్ట అతిథిగా మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్. ఎ.విద్యాసాగర్ పాల్గొన్నారు.ప్రత్యేక అతిథిగా కవి, రచయిత శ్రీ ఎం.వి.రామిరెడ్డి పాల్గొని విశాలాక్షి తరపున పబ్లిషర్ క్రోసూరు రత్నం ,ఎడిటర్ ఈతకోట సుబ్బారావు మూడు విభాగాల్లో బహుమతులు ప్రకటించారు.జడపల్లె పెంచలయ్య,సుబ్బమ్మ స్మారక కథల పోటీ,సి.వి.ఎస్.మహేశ్వర్ స్మారక మినీకథల,కవితల పోటీ,కొమర్రాజు వెంకట మోహనరావు,పద్మావతి గార్ల స్మారక కథల పోటీల విజేతలు పురస్కారాలు అందుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం, వేళ్ళచింతలగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ కౌలూరి ప్రసాదరావు,జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో కండక్టరుగా పనిచేస్తున్న విషయం విదితమేతనఉద్యోగవృత్తిధర్మంనిర్వర్తిస్తూనే,ప్రవృత్తులైన సాహిత్యమూ,చదరంగంలో విశేష కృషి చేస్తున్న ప్రసాదరావుపై గ్రామస్థులు, సహోద్యోగులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.మరిన్ని అవార్డులు, సన్మానాలతో ఉన్నత శిఖరాలని అధిరోహించాలని అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వం డయేరియారోగులకు అండగా ఉంటుంది.







**కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే వెంకటరాజు.**

**గోపాలపురం, పెన్ పవర్, మార్చి 17.** మండలం లో డయేరియా గ్రామాలలో తూర్పుగోదావరి జిల్లా కలక్టర్, గోపాలపురంఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సోమవారం డయేరియా ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

డయేరియా తీవ్రత వాతావరణ మార్పులు, వడగాలులు నేపథ్యంగా ప్రాథమిక అంచనా!

పూర్తీ స్థాయిలో వివరాలు చేసేందుకు 10 ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నాయన్నారు.

ఒకే ప్రాంతంలో కాకుండా చెల్లాచెదురుగా అక్కడక్కడ ఆరు ఏడు గ్రామాల్లో కేసులు నమోదు అయ్యాయి.ఇప్పటికే 20 మందినీ డిశ్చార్జి చేశాం

తొమ్మిది మందికి వైద్యం అందిస్తున్నాం...

పరిస్థితి అందుపులో ఉంది అన్నారు. డయేరియా బారిన పడినవారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది అని పేర్కొన్నారు.

గ్రామాల్లో వాటర్ స్టోరేజ్ ట్యాంకుల క్లోరినేషన్.

పరిస్థితి పూర్తి స్థాయిలో అదుపులోకి వొచ్చే వరకూ క్షేత్ర స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి .ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ఆదేశించారు .

క్షేత్రస్థాయిలో తగిన వైద్య బృందాలను అందుబాటులో ఉంచి ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు.

మండలంలో గోపాలపురం, పెద్ద గూడెం తదితర గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, ఆర్డీవో రాణి సుస్మిత, డి ఎమ్ హెచ్ వో డా కె వెంకటేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డా ఎన్ని పద్మశ్రీ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ బీవీ గిరి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి శాంతామణి,ఇతర వైద్య ఆరోగ్య, రెవెన్యు, ఆర్డబ్ల్యూఎస్ , పంచాయతి రాజ్, శాఖల జిల్లా స్థాయి అధికారులు , స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పర్యటించారు .ఈ సందర్భంగా పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులు మార్పులు ఎక్కువ ఉష్ణోగ్రత వేడి తదితర కారణాలతో గోపాలపురం మండల పరిధిలో పలు గ్రామాల్లో నివసిస్తున్న వారు డయేరియా బారిన పడిన పద్దారని వారికిచికిత్స అందిస్తున్నాము అన్నారు. 25 మంది చికిత్స పొందగా, 20 మంది ని డిశ్చార్జ్ చేశామన్నారు. సోమవారం నాలుగు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. హాస్పటల్లో 9 మంది చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. అనుమానస్పద డయారియా కేసులను గుర్తించేందుకు ఇంటింటి సర్వేను చేపడుతున్నట్లు తెలిపారు. డయేరియా ప్రభలడానికి కు గల కారణాలను తెలుసుకోవడం జరుగుతుందని వారి రక్త నమూనాను ల్యాబ్ లకు పంపి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ వైద్య బృందాలు ఇంటింటి సర్వే చేపట్టి డయేరియా తీవ్రత ను అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అక్కడ అక్కడ కేసులు నమోదు అవ్వడం తమ దృష్టికి వచ్చిందని ప్రస్తుతం పరిస్థితి పూర్తి అదుపులో ఉందన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకులు స్టోరేజ్ ప్రాంతాలను క్లోరినేషన్ చేశామని, సోమవారం మరో దఫా క్లోరినేషన్ చేయించామన్నారు. ప్రజలకు అవసరమైన ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచామన్నారు.

ఇంతే ఎక్కువ స్థాయిలో డయేరియా కేసు నమోదు పై మూల కారణం తెలుసుకునే దిశగా జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటుందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు పాత్రికేయులతో మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనావేయడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మెరుగైన వైద్య చికిత్స అందించేలాగా తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎండలు తీవ్రత పొగాకు సాగు నేపథ్యం తదితర కారణాలవల్ల ప్రజలు డయేరియా కు గురైనట్లు ప్రాథమిక రావడం జరిగింది అన్నారు. డయోరియా రావడంపై పూర్తిస్థాయిలో తగు కారణాలను తెలుసుకునేందుకు అధికారులు బృందం నమూనాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇందుకోసం పది వైద్య బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల పరిధిలోని గోపాలపురం , పెద్దగూడెం, ఉప్పర గూడెం , పెద్దాపురం, వేళ్ల చింతలగూడెం, చిట్యాల , అన్న దేవరపేట గ్రామాలలో ఈ డయేరియా కేసులు నమోదయ్యాయి అని పేర్కొన్నారు. ప్రస్తుతం 9 మంది వైద్య సేవలు పొందుతున్నారని వారితో మాట్లాడటం జరిగిందని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. నీటి కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం, శాంపిల్స్ టెస్ట్ చేసి వాస్తవ వివరాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండి వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే వెంకట రాజు తెలిపారు.





## ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు...







**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..**

**దేవీపట్నం,పెన్ పవర్,మార్చ్17:**మండలంలోని దామనపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షలు విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. మండలంలో సుమారు ఐదు పాఠశాలలకు చెందిన 187 మంది విద్యార్థులు మొదటిరోజు తెలుగు పరీక్షకు హాజరయ్యారని సిట్టింగ్ స్క్వాడ్ అధికారి ఎం.సురేష్ బాబు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు కట్టుదిట్టమైన భద్రతల మధ్య ఎంఈఓ శిరసం బాలుదొర పర్యవేక్షణలో జరుగుతున్నాయి.ఎంఈఓ మాట్లాడుతూ.... ఫ్లయింగ్ స్క్వాడ్,సిట్టింగ్ స్క్వాడ్,హై పవర్ కమిటీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.పరీక్షా కేంద్రంలోకి సెల్ఫోన్ గాని ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం లేదని, కేవలం విద్యార్థులు హాల్ టికెట్,పరీక్షలు రాసేందుకు అవసరమైన మాత్రమే అనుమతిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల్లో విశాలమైన వాతావరణంలో, మంచినీటి సౌకర్యం,ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా టాయిలెట్ సౌకర్యం ఏర్పాటు చేశామని, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో సిబ్బంది కూడా అందుబాటులో ఉందని తెలిపారు.అనంతరం పరీక్షా కేంద్రాన్ని తహసిల్దార్ సత్యనారాయణ పర్యవేక్షించారు. తహసిల్దార్ మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది సహకారంతో పగడ్బందీగా తనిఖీ చేసే లోపలికి అనుమతిస్తున్నామని పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు పర్యవేక్షణలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని అన్నారు.విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని,దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ,రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ,తదితరులు పాల్గొన్నారు.

## పి -4 సర్వే లో 100 శాతం సాధించిన అల్లవరం మండలం



**పెన్ పవర్, మార్చి 17**రాష్ట్రం లో నిర్వహిస్తున్న పి -4 సర్వే లో నేడు అల్లవరం మండలంలోని 23 సచివాలయం లు లో కలిపి మొత్తం 19805 కు 19805 సర్వే పూర్తి చేయడం ద్వారా రాష్ట్రం లోను, జిల్లాలోనూ కూడా 100% సాధించిన మొదటి మండలం గా నిలిచింది. పబ్లిక్, ప్రయివేట్ పీపుల్స్ పార్టనర్స్ షిప్ పేరుతో ప్రతీ సచివాలయం పరిధిలో దిగువ మధ్యతరగతి, పేద వర్గాలకు ఉపయుక్తంగా సహాయ సహకారాన్ని అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ సర్వే చేపట్టింది.. పీ-4 సర్వే లో అల్లవరం మండలాన్ని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేసిన ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, సిబ్బందిని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు, జిల్లా నోడల్ అధికారి ఎస్టీ వి రాజేశ్వర రావు తదితర అధికారులు అభినందించారు. మండలాన్ని రాష్ట్రంలో అగ్ర పథంలో నిలిపిన సచివాలయం సిబ్బందిని ఎంపీడీఓ కృష్ణ మోహన్ అభినందించారు..

## డి.సి.హెచ్.ఎస్ డాక్టర్ కే. లక్ష్మి పర్యటన......



**అడ్డతీగల, పెన్ పవర్, మార్చి17:** స్థానిక అడ్డతీగల సామజిక ఆరోగ్య కేంద్రం నందు ఆదివారం గంగవరం సమీపంలో రోడ్డు ప్రమాదం లో చనిపోయిన మృతదేహాలకు సత్వరమే బంధువులకు అప్పగించాలని హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ ని ఆదేశించారు. అదేవిదంగా

రోడ్డు సంఘటనలో జరిగిన ప్రమాదపు వివరాలు, స్థానిక హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ పండా. సతీష్ నీ అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న చనిపోయిన బంధువులతో మాట్లాడారు.గాయపడిన వారిని కాకినాడ గవర్నమెంట్ హాస్పిటల్ సూపర్డెంట్ తో మాట్లాడి వెంటనే వైద్యం అందించాలని కోరారు. జరిగిన సంఘటనకు దిగ్బ్రాంతి వక్తంచేశారు.

చనిపోయిన వారి వివరాలు అడిగి తెలుసుకుని, వెంటనే కాకినాడ వెళ్లి గవర్నమెంట్ హాస్పిటల్ లో గాయపడిన వారి గురించి జి.జి. హెచ్ కాకినాడ సూపర్డెంట్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## ఆలమూరు గోదావరి ఏటిగట్టుపై కొండ చలువ హల్చల్.



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 17:**ఆలమూరు వద్ద గోదావరి ఏటిగట్టుపై సోమవారం రాత్రి 7గంటల సమయంలో గోదావరి లంక భూముల నుంచి కాలువ వైపుకు కొండ చలువ ప్రయాణించింది. రోడ్డుపై కొద్దిసేపు ఈ పాము ఉండిపోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనాలు కొద్దిసేపు నిలిచిపోయాయి. పాము కొద్దిసేపటి తర్వాత కాలువ వైపుకు వెళ్ళిపోయింది. ప్రయాణికులు కొద్దిసేపు భయఆందోళనకు గురయ్యారు. ఈ దృశ్యాలను పలువురు సెల్ఫోన్లో చిత్రీకరించారు.

# చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి







**కురుపాం /పార్వతీపురం, పెన్ పవర్, మార్చి 17 :** వేసవి వేడిమి దృష్ట్యా చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ చెప్పారు.
వేసవి వేడిమి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) తగితర అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
వేడిమి పెరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అత్యవసర పనులు ఉంటే బయటకు రావాలని ఆయన అన్నారు. టోపీ, గొడుగు వంటి వస్తువులు నీడ కోసం వాడాలని ఆయన అన్నారు. తెల్లని వదులు దుస్తులు వేసుకోవడం మంచిదని ఆయన చెప్పారు. ఉపాధి హామీ ప్రదేశాల్లో సైతం నీడ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వేతనదారులకు నీరు అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టకుండా సమయాల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగాలని, శరీరం డీ హైడ్రేషన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వడ దెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఆయన చెప్పారు. ఎక్కువ సేపు ఎండలో ఉండి అతి చల్లని పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఎండలో ఎక్కువ సేపు తిరిగి చల్లని నీటిని తలపై వేసుకోవడం వలన కూడా వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న వేడిమి దృష్ట్యా ప్రతి ఒక్కరూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం మేరకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవడం, కొబ్బరి బొండాలు పానీయాలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయన కోరారు.
ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె హేమలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏఎల్.పురంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన కూటమి నాయకులు.....




**గొలుగొండ పెన్ పవర్ (మార్చి 17):** మండలంలో గల మేజర్ పంచాయతీ ఏఎల్.పురం పంచాయతీలో రూ.9లక్షలతో చేపట్టబోయే మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సారథ్యంలో నర్సీపట్నం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఈ ఎనిమిది నెలల కాలంలో రూ.78 కోట్లు వెచ్చించారని చెప్పారు. ఆ నిధులతో ఇప్పటి అన్ని గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటివి నిర్మించడం జరిగిందన్నారు. కేవలం ఎల్ పురం పంచాయతీకే రూ.కోటి 27 లక్షలు కేటాయించారన్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లుగా మారాయని అన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపిటిసి రుత్తల రామకృష్ణ, గొలుగొండ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ బాబు, జనసేన బిసి సెల్ అధ్యక్షులు దొంగలరమేష్ , పారిశ్రామికవేత్త వెలగా కృష్ణారావు, బొడ్డు జమీలు తదితరులు పాల్గొన్నారు.ద

## విద్యార్థులు అందరూ పరీక్షలకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలి





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్,అనకాపల్లి, మార్చి 17:** పదవతరగతి పరీక్షలకు విద్యార్థులు శతశాతం హాజరు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల తనిఖీలలో భాగంగా స్థానిక ఎన్.టి.ఆర్. ఆసుపత్రి వద్ద గల భాష్యం పాఠశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టరు తనిఖీచేసారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆరోగ్యశిబిరం, భద్రత, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాల గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావునాయుడును జిల్లా కలెక్టరు ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజినల్ అదికారి షేక్ ఆయిషా పాల్గొన్నారు.

## చలివేంద్ర సెంటర్లు ఏర్పాటు చేయాలి

జై భీమ్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఇన్చార్జ్ వి రామకృష్ణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 17:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలకు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థులకు వారికి తోడుగా వచ్చిన తల్లిదండ్రులకు అందుబాటులో చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వారికి మజ్జిగ మంచినీళ్లు వంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలని జై భీమ్ వెల్ఫేర్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జ్ వేములపూడి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బి.సోమరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షలు అంటే భయం లేకుండా ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు హాజరైన విద్యార్థులకు ప్రయాణంలో సహకరించాలని కోరారు.

# 87వ వార్డ్ లో మంచినీటి కొరత





సమస్యను పరిష్కరానికి చర్యలు

జీవీఎంసీ ఈ ఈ ,ఏ ఈ తో రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం బేటీ

**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 17** జి వి యం సి 87వ వార్డ్ లో మంచినీటి సమస్యపై రాష్ట్ర కార్యదర్శి 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం ఆధ్వర్యంలో జీవీఎంసీ వాటర్ డిపార్ట్మెంట్ ఈ ఈ ,ఏ ఈ తో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ , శిథిలావస్థ కు చేరిన వాటర్ ట్యాంక్ పరిశీలించారు . 87 వార్డు జనాభా సుమారు 30వేల మంది జనాభా ఉన్నారని, ఇప్పుడు సరఫరా చేస్తున్న మంచినీరు వినియోగం పెరగడం వల్ల వాడే నీరు సరిపోవడం లేదని, కొన్నిచోట్ల మంచినీటి ప్రెషర్ తక్కువ రావడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని రానున్నది వేసవకాలమని , ఇప్పుడు వస్తున్నా ఔట్ ఫ్లో సరిపోదని, ట్రీట్మెంట్ ప్లాంట్ లో ఉన్న ఆరు మోటర్లలో నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయని, అన్ని పని చేసే విధంగా చేసి స్పేర్ ఉండే విదంగా కృషిచేయ్యాలని , పై సమస్యలను దృష్టిలో పెట్టుకొని పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని బోండా కోరారు. అనంతరం స్పోర్ట్స్ కాంప్లెక్స్ తయారు అవుతున్న ప్రాంగణంలో సిదిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ ను తొలగించాలని గతంలో నివేదిక సమర్పించడం జరిగిందని తక్షణమే ఆ ట్యాంక్ ను తొలగించి ప్రక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో మరో ట్యాంక్ ను పునర్నిర్మాణం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రాజన్ రాజు, అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, సీనియర్ నాయకులు ఆనంద్ కుమార్, దాలయ్య, కడుపుట్ల శ్రీను, జాన్ రమేష్, నాగభూషణ్, సచివాలయం సిబ్బంది మహాలక్ష్మి,విశ్వకాంత్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్న జిల్లా ఎస్పీ





సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి

బాధితుల సమస్యలను తక్షణమే చట్టపరిధిలో పరిష్కరించాలి

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,విజయనగరం, మార్చి 17** :సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కా న్ఫరెన్సులో మాట్లాడి, సమస్యలను వివరిం చి, చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యా దులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు
'ప్రజా సమస్యల పరిష్కార వేదిక"పబ్లిక్ గ్రీవియ న్స్ రిడ్రెసల్ సిస్టం కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబం ధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారు ల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాల ని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీగారు 32 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీ కరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబం ధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించి నవి 7, మోసాలకు పాల్పడినట్లు 8, ఇతర అం శాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నా యన్నారు. నంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరా లను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్త వమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలుచేపట్టాల ని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణ మే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యా దుదారుల సమస్యలను పరిష్కరించేందుకు
చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయా నికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే. చౌదరి, డిసిఆర్బి ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జీకే వీధిలో మొదటిరోజు పదవ తరగతి పరీక్షల్లో శతశాతం హాజరు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి17:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో గల మూడు పరీక్ష కేంద్రాలలో శతశాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లోని ఏ కేంద్రంలో 220 మంది, బి కేంద్రంలో 148 మంది, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన సి కేంద్రంలో 220 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు. ఒక్క విద్యార్థిని కూడా గైర్హాజర్ కాలేదు.తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు తగ్గి సత్యనారాయణ, రామన్న తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు.పోలీస్ శాఖ పరీక్షా కేంద్రాల చుట్టూ ఎటువంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

## ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి.....

మండల తాహాశీల్దార్ ఏ.వేణుగోపాల్......

**నాతవరం పెన్ పవర్ (మార్చి 17):** రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని మండల తహసిల్దార్ ఏ.వేణుగోపాల్ తెలియజేశారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలలో ఉన్న రేషన్ కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులు ఐదు సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు వయసు కలిగిన ప్రతి ఒక్కరూ మార్చి 31వ తేదీ లోపు ఈ కేవైసీ చేయించుకోవాలని తాసిల్దార్ తెలియజేశారు. ఈకేవైసీ చేయించుకొని ఎడల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్న నిత్యవసర సరుకులు తీసుకునే అవకాశాన్ని కోల్పోవడం జరుగుతుందని ప్రభుత్వం తెలియజేయడం జరిగిందని అన్నారు.కాబట్టి మీ దగ్గరలో ఉన్న చౌక దుకాణాలు వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు.

## గడ్డి మందు సేవించిన యువతి వైద్యం పొందుతూ మృతి- ఎస్ ఐ చినబాబు

**రాజవొమ్మంగి పెన్ పవర్ మార్చ్ 17:**రాజవొమ్మంగి,మండలంలోని అమీనాబాద్ కాలనీకి చెందిన రావుల సంజన ప్రియ(19) కాకినాడ జిజిహెచ్ లో వైద్యం పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ ఐ చిన బాబు తెలిపారు. సంజన ప్రియ వంట చేయకుండా టీవీ చూస్తూ ఉంటుందని గత రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు మందలించడంతో ఆవేశంలో సంజన ప్రియ గడ్డి మందు సేవించగా స్థానిక పి హెచ్ సి కి తరలించడం జరిగింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా వైద్యం పొందుతూ సంజన ప్రియామృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పీఎం అనంతరం మృతదేహం బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## సర్వమత సమైక్యత ప్రతీక రంజాన్ :ఎమ్మెల్యే పల్లా





**గాజువాక:పెన్ పవర్ ,మార్చి 17** సర్వమత సమైక్యతే రంజాన్ ప్రత్యేకత అని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.గాజువాక కణితి రోడ్డు,అజీమాబాద్ సున్ని జామా మసీదులో ఆదివారం ఫరీద్ కుటుంబం ఇచ్చిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా గాజువాకలో రంజాన్ వేడుకలు,ఇఫ్తార్ విందు కార్యక్రమాలు జరగడం సర్వమత సమైక్యతతో ఉండడం ఒక నిదర్శనం అని అన్నారు.ముస్లింలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.అజీమాబాద్ మజీద్ పునర్నిర్మాణం కోసం కావాల్సిన సహకారాన్ని అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ,మరో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు,ఫరీద్ ఫ్యామిలీ సభ్యులు హాజీ,అమీర్,వలీల్, మున్నా,హసన్ వలి, సాలేహీన్ వలి,షబ్బీర్, బుజ్జి,అక్బర్ అలీ, మదీనా వలి,ఇషాక్, మోతి,అన్సర్ వలి, జబ్బార్ నాన్న,ముర్తాజా,గోమాడ వాసు తదితరులు పాల్గొన్నారు.వేలాదిగా తరలి వచ్చిన ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.అనంతరం ముస్లింలతో కలిసి విందు స్వీకరించారు.

## రూ.32.50 లక్షల జీవీఎంసీ అభివృద్ధి నిధులతో మౌలిక వసతులకు శంకుస్థాపన





**ఎన్ఏడి, పెన్ పవర్, మార్చి 17 :** జీవీఎంసీ 90వ వార్డు, కనకమహాలక్ష్మినగర్ వాసుల మరియు అసోసియేషన్ వారి విన్నపం మేర సామాజిక భవనం సమస్యను స్థానిక వార్డ్ కార్పొరేటర్ బొమ్మిడి రమణ దృష్టికి తీసుకురాగా స్పందించి, పశ్చిమ నియోకవర్గం శాసనసభ్యులు గణబాబు సూచన మేరకు రూ.32.50 లక్షల జీవీఎంసీ వార్డ్ అభివృద్ధి నిధులు మంజూరు చేయించి, నేడు శంకుస్థాపన చేయడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ కలను సాకారం చేసినందుకు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం ఏఈ వెంకటలక్ష్మీ, జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, సోమేశ్, కనకమహాలక్ష్మినగర్ అసోసియేషన్ వారు ఈ.గోపాలరావు, డిటి నాయుడు,రామ్ ప్రసాద్, పెద్ది నాయుడు, సర్వేస్వరరావు, శేషగిరిరావు, విశ్వనాధం, కృష్ణ, రవి ప్రసాద్, రామకృష్ణ, రాజకుమార్, జగన్ మోహన్రావు, సిద్ద భాస్కర్, లలిత, రమణ, మురళి, కె కె, ఏ ఎస్ ఆర్ శ్రీను, నర్సింగ్ రెడ్డి, బషీర్, రూప సుందర్ పెద్ద ఎత్తున కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించడం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు వెంకట రావు.

**అనంతగిరి పెన్ పవర్ మార్చి 17.** అనంతగిరి మండలంలో పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించడం జరిగిందని మండల గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కూడ వెంకట రావు అన్నారు. సోమవారం ఆయన అనంత గిరి పెన్ పవర్ రిపోర్టర్ తో మాట్లాడారు. పరీక్ష కేంద్రాలు 1బాలికల ఆశ్రమ పాఠశాల (గర్ల్స్ 1) 2. కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల 3). కొత్తూరు కేజీబీవీ పాఠశాల,4) శివలింగపురం బాలురు ఆశ్రమ పాఠశాల నాలుగు పరీక్ష కేంద్రాలకు 717 మంది పదవ తరగతి విద్యార్థులకు గాను 11 మంది గైర్హాజరయ్యారని,706 మంది పరీక్ష కేంద్రాలకు చేరుకొని సీసీ కెమేరాల కనుసందానంలో పరీక్షలు రాయడం జరిగిందని, ఇటువంటి మాస్ కాపీయింగ్ లేకుండా సిట్టింగ్ కేడర్ల మధ్య విద్యార్థులు పరీక్ష వ్రాయడం జరిగిందని తెలిపారు.

# పాయకరావుపేటలో 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా






**జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో పరీక్షా కేంద్రాలకు కఠిన భద్రతా ఏర్పాట్లు**

**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 17 :** జిల్లాలో ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాయకరావుపేట పోలీసులు డ్రోన్ల సహాయంతో నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు చేపట్టడంతో పాటు 144 సెక్షన్‌ను అమలు చేశారు. పాయకరావుపేట ఎస్.హెచ్.ఓ జి.అప్పన్న ఆధ్వర్యంలో శ్రీ ప్రకాశ్, కనోస, పాయకరావుపేట జెడ్పీహెచ్ గర్ల్స్, జెడ్పీహెచ్ హైస్కూల్ వంటి ప్రధాన పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లను వినియోగించి నిఘా పెట్టారు.

**కఠిన నియంత్రణ చర్యలు..**

పరీక్ష కేంద్రాలు చుట్టూ 144 సెక్షన్ అమలు, అనుమతి లేని వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్దకు రాకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసు పెట్రోలింగ్, ప్రత్యేక బృందాలు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో క్రమం తప్పకుండా టహాలు నిర్వహిస్తున్నారు. జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్ల మూసివేత అభ్యర్థుల మైనపోరా నివారించేందుకు పరీక్షల ముగిసే వరకు వాటిని మూసివేత, కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత %-% పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, పర్యవేక్షణ చేసే స్కూల్ సిబ్బందిని మాత్రమే అనుమతించడంతో పాటు ఇతరుల ప్రవేశాన్ని పూర్తిగా నిరోధించడం. ఈ నిఘా, భద్రతా చర్యలు ప్రశాంతమైన, నిష్పాక్షికమైన పరీక్షా వాతావరణాన్ని సమకూర్చేలా పోలీసులు కృషి చేస్తున్నారు.

## వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలగా పేడాడ రమణి కుమారి





**ఎన్ఏడి, పెన్ పవర్, మార్చి 17 :** విశాఖపట్నం మాధవధారలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలగా పేడాడ రమణి కుమారి నియమితులైన సందర్భంగా హిందూస్తాన్ షిప్‌యార్డ్ ఐ ఎన్ టి యు సి యూనియన్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా నాయకులు, గాంధీ నగర్ మహిళలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతున హనుమంతురావు, దక్షిణ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు బంగారమ్మ, పశ్చిమ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాల పేడాడ జోష్నా, భీమిలి మహిళా నాయకులు రజనీ, శ్రీదేవి, గాయత్రీ, లక్ష్మి , సత్య, రామలక్ష్మి, మాజీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్, పప్పుల లక్ష్మణ్, సనపల కొండలరావు, రోజారాణి, లావణ్య, స్వాతి, పావని, దమయంతి, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఆర్ మూర్తి, ధనుంజయరావు, సురేష్, శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, వల్లి, గణేష్, శ్రీను, సన్యాసిరావు, లక్ష్మణ్ రావు, కృష్ణమూర్తి, రవి కుమార్, అప్పల నాయుడు, జగనకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 ఫిర్యాదులు





- **సంబంధిత పోలీసు అధికారులకు తక్షణ చర్యలకు సూచనలు**
- **జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహనరావు**

**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 17 :** జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 40 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత వ్యవహారాలు వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులకు తక్షణ విచారణ జరిపి, చట్టపరంగా సత్వర పరిష్కారం కల్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా పరిశీలించి, బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటాం" అని అదనపు ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి.వెంకన్న తదితర అధికారులు పాల్గొన్నారు.

## క్వారీ లారీ రైల్వే ట్రాక్‌ను ఢీకొన్న ఘటన కఠిన చర్యలు

**అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ**




**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 17 :** తెల్లవారుజామున అనకాపల్లి పట్నంలోని విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద మార్టూరు నుండి అనకాపల్లి వైపుగా రాళ్లతో వస్తున్న క్వారీ లారీ నిర్లక్ష్యంగా వెళ్ళి రైల్వే ట్రాక్‌ను ఢీకొనడంతో ట్రాక్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తీవ్రంగా స్పందించారు. వారి ఆదేశాల మేరకు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ సంబంధిత లారీని అదుపులోకి తీసుకుని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ద్వారా రూ. 1,01,730/- జరిమానా విధించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అధిక లోడుతో ప్రయాణించే లారీ యజమానులను పిలిపించి, ప్రమాదాలకు కారణమైన, నిర్లక్ష్యంగా లారీలు నడిపిన డ్రైవర్లకు హెచ్చరించడం జరిగిందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్వారీ లారీలు, గూడ్స్ లారీలు పై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగా, లారీ యజమానులు మరియు డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి రవాణా నిబంధనలు, రహదారి భద్రతా నియమాలు గురించి అవగాహన కల్పించనున్నారు. జిల్లా పోలీసులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, రవాణా నిబంధనలు పాటించాలని సూచిస్తోంది. నిబంధనలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అదనపు సాయం చేయటం అభినందనీయం



కాకూరు శేఖర్,ముక్కలి రమేష్,కొయ్యం బాలు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 17 :** కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు పది నెలలు కావస్తున్న గిరిజన ఆదివాసి జాతుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని గూడెం కొత్తవీధి మండల కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు కాకూరి శేఖర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు అన్నారు. సొంతింటి కలలు నెరవేర్చేందుకు పెద్దపీట వేసిందని తెలిపారు. ఆదిమ జాతి ఆదివాసులు( పివిటిజి) లకు అదనంగా గృహ నిర్మాణానికి లక్ష రూపాయలు అదనపు సహాయం అందించటం జరుగుతుందని, అలాగే పివిటిజిలు కానీ గిరిజనులకు 75 వేల రూపాయల సహాయం గృహ నిర్మాణాల కోసం ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో గిరిజన ప్రజల కోసం చేసింది సున్నా అని, అయినా మేమే అంత చేసాము అని గొప్పలు చెప్పుకుంటున్నారు అని ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే లోకల్ ఎన్నికలలో ప్రజలు కూటమికే పట్టం కడతారని జోస్యం చెప్పారు.

## అంగరంగ వైభవముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్ మార్చి 17 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## పోలీసుల దాడుల్లో 700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం...





**కురుపాం,పెన్ పవర్, మార్చి-17,**మండలంలో దురిబిలి గ్రామ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఎస్సై పి. నారాయణరావు తన సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో 700 లీటర్లు సారా తయారీకి సిద్ధంగా ఉన్నటువంటి బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సారా తయారీకి వాడుతున్నటువంటి పరికరాలను స్వాధీన పరుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా తయారుచేసినా,అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ ద్వారాలు తెరిచే ఉన్నాయ్...

**విజయవాడ, మార్చి 17, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ పార్టీ కార్యాలయం గేట్లు ఓపెన్ చేస్తున్నారు. గతంలో పార్టీని వీడిన నేతలను ఒక్కొక్కరుగా చేరిపోయేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీని వీడి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకునేందుకు కూడా జగన్ సిద్ధమయినట్లు తెలిసింది. ఈ మేరకు సంకేతాలను పంపారు. గత ఎన్నికలకు ముందు, తర్వాత వివిధ కారణాలతో పార్టీని వీడి అనేక మంది సీనియర్ నేతలు పార్టీని వీడి వెళ్లారు. సామాజికవర్గంగానే మాత్రమే కాకుండా ఆర్థికంగా బలమైన నేతలు కూడా పార్టీని వీడివెళ్లారు. అయితే ఇతర పార్టీలకు వెళ్లిన నేతలు అక్కడ ఆనందంగా లేరు. అక్కడ వారికి ప్రాధాన్యత దక్కడం లేదు. మరొక వైపు వైసీపీకి అంతో ఇంతో మళ్లీ గ్రాఫ్ పెరుగుతుందని భావించి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని ప్రచారం జరగుతుంది.. గత ఎన్నికల సందర్భంగా సీట్లు దక్కని వాళ్లు, జగన్ పోకడలను నచ్చని వాళ్లు పార్టీని వదిలి వెళ్లిపోయారు. కూటమి ఏర్పాటుతో తమ ఓటమి ఖాయమయిందని నమ్మిన నేతలు భవిష్యత్ లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావించి తమ దారి తాము వెతుక్కున్నారు. జగన్ కూడా వెళ్లిపోయిన నేతలను ఎవరినీ ఆపలేదు. అలాగని రమ్మని పిలవడం లేదు. వారంతట వారు వస్తే మాత్రం తిరిగి పార్టీలో చేర్చుకుంటామని మాత్రం జగన్ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. నిన్న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎవరైనా వస్తానంటే తాను కాదంటానా? అని నవ్వుతూ ఆయన అనడంతో పార్టీని వీడిన నేతలను తిరిగి చేర్చుకుంటారన్న నమ్మకం నేతల్లో పెరిగింది.. ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీని వీడి వెళ్లి వచ్చినా ఆయనను కూడా తిరిగి పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తాజాగా ఇప్పటికే రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని పార్టీలోకి చేర్చుకునేందుకు జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో కాపు రామచంద్రారెడ్డి



వైసీపీని వీడి కాంగ్రెస్ లో చేరిపోయారు. తిరిగి ఆయన వస్తానని కబురు పంపడంతో జగన్ అందుకు అంగీకరించారంటున్నారు. ఒక ఫైన్ మార్నింగ్ కాపుకు వైసీపీ కండువా కప్పేందుకు సిద్ధమవుతున్నారు. కాపు రామచంద్రారెడ్డితో పాటు మరికొందరు నేతలు కూడా రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది తూ.గో నేత ఒకరిని... అంటే కూటమి పార్టీకి చెందిన నేతలు ఎవరూ రారు. ఒకవేళ వచ్చినా ఎన్నికలకు ముందు మాత్రమే వస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో అసంతృప్తిగా ఉన్న ఒక నేతను పార్టీలో చేర్చుకోవడానికి కూడా జగన్ దూతలను పంపినట్లు తెలిసింది. గత ఎన్నికలలో ఆయనకు టిక్కెట్ రాకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారని గ్రహించి దూతలను పంపారని సమాచారం. దీంతో పాటు ఇతర పార్టీల నేతలను కూడా పార్టీలోకి తీసుకుంటారని చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి కూడా అనేక మంది నేతలు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెబుతున్నారు. మొత్తం మీద ఫ్యాన్ పార్టీకి త్వరలో చేరికలు ఉంటాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది.

# యనమల రామకృష్ణుడి శకం ముగిసినట్టేనా

**కాకినాడ, మార్చి 17, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీలో అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరు యనమల రామకృష్ణుడు.. తెలుగుదేశం ఆవిర్భావం నాటి నుంచి చట్టసభల్లో ఏదో ఒక పదవిలో కొనసాగుతూ వచ్చిన యనమలకు ప్రస్తుతం ఎమ్మెల్సీ పదవీకాలం ముగియడంతో ఏ పోస్టు లేకుండా పోయింది.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆయనకు ఈ సారి ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ చేయలేదు.. దాంతో రాజకీయాల్లో యనమల రామకృష్ణుడి శకం ముగిసిందా అన్న చర్చ మొదలైంది. నాలుగు దశాబ్దాలకు పైబడిన రాజకీయ జీవితంలో తొలిసారి చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండాపోయిన యనమల పొలిటికల్ ఫ్యూచర్‌పై పెద్ద చర్చే జరుగుతోందిప్పుడు.టీడీపీలో అత్యంత సీనియర్ నేతలుగా కొనసాగుతున్న నేతల్లో యనమల రామకృష్ణుడు ఒకరు. అశోక్ గజపతి రాజు, యనమల రామకృష్ణుడు, షరీఫ్ వంటి సీనియర్లు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. యనమల రామృకృష్ణుడు తొలిసారి 1983లో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఏదో ఒక చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉన్నారు. మంత్రిగా, స్పీకర్‌గా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గా అనేక కీలకపదవులు నిర్వహించారు. 73 ఏళ్ల వయస్సులోనూ రాజకీయాల్లో యాక్టివ్ గానే ఉంటున్నారు.అయితే పార్టీలో యువతను ప్రోత్సహించాలనే కొత్త ఫార్ములాను టిడిపి ఈమధ్య ఆచరణ లో పెడుతోంది. దాని కారణంగా యనమల లాంటి సీనియర్లను పక్కన పెడుతున్నారు అనే ప్రచారం పార్టీలోనే సాగుతోంది. యనమల కుమార్తె దివ్య ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా తుని శాసనసభ్యురాలి గా ఉన్నారు. 1983 నుండి 2004 వరకూ 6 సార్లు ఎమ్మెల్యే గా యనమల రామకృష్ణుడు గెలిచిన నియోజకవర్గం అది. 2009 లో తొలిసారి ఓటమి చెందినా ఆయనకు కీలక పదవులు ఇచ్చి టీడీపీ గౌరవించింది.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎమ్మెల్సీగా ఉన్న యనమలకు చంద్రబాబు మంత్రిపదవి కట్టబెట్టారు. పార్టీ అధికారంలో లేనప్పుడు సైతం పీఏసీ చైర్మన్ వంటి పదవులు ఇచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడి పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. అయితే ఈసారి ఆయనకు ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇవ్వకపోవడంతో పొలిటికల్ గా యనమల కెరీర్ కు చెక్ పడినట్టే అని ప్రచారం మొదలైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో యనమలకు మరోసారి అవకాశం దక్కుతుందని భావించారు.టీడీపీకి దక్కిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండు బీసీలకు కేటాయించినా యనమలకు మాత్రం ఛాన్స్ దక్కలేదు. బీటీ నాయుడు, బీద రవిచంద్రలను బీసీ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎంపిక చేశారు. యనమల తుని నుంచి 2009 ఎన్నికల్లో తొలి సారి పరాజయం పాలయ్యారు. అప్పుడు కూడా చంద్రబాబు 2013లో ఆయన్ని ఎమ్మెల్సీని చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు యనమల శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతూ వచ్చారు. అదీకాక యనమల బంధుగణానికి కూడా చంద్రబాబు పార్టీలో మంచి ప్రాధాన్యతే ఇచ్చారు. యనమల సన్నిహిత బంధువు , టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రస్తుతం మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. పుట్టా మహేష్‌కుమార్ ఏలూరు ఎంపీగా గెలిచారు. యనమల కూతురు తుని ఎమ్మెల్యేగా విజయం సాధించారుఅయినా తనకు టికెట్ దక్కకపోవడంపై యనమల ఎలా రియాక్ట్ అవుతారా అన్న అంశంపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వాస్తవానికి చంద్రబాబు తన కేబినెట్ లో యనమలకు అవకాశం ఇవ్వకపోవడంతో.. ఇప్పటికే యనమల ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి కొలువుదీరిన తరువాత కాకినాడ పోర్టు విషయంలో తెలుగుదేశం తీసుకున్న నిర్ణయాన్ని, అనుసరించిన విధానాన్ని వ్యతిరేకిస్తూ యనమల కొన్ని వ్యాఖ్యలు చేయడంతో ఆయన పార్టీకి దూరం జరుగుతున్నారా అన్న అనుమానాలు కూడా అప్పట్లో వ్యక్తం అయ్యాయిపొలిటికల్ గా ఎప్పుడు గుంభనంగా ఉండే యనమల రామకృష్ణుడు కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక

సమయంలో ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. బీసీ కోటాలో ఆయన ఆ పదవి ఆశించారు. దక్కకపోయేసరికి కొంత అసంతృప్తికి లోనై అధ్యక్షుడికి లేఖ రాశారు.ఇక ఇప్పుడు తాజాగా ఆయనకు ఎమ్మెల్సీగా మరో అవకాశం ఇవ్వకపోవడంతో యనమల ఎలా రియాక్ట్ అవుతారన్న ఆసక్తి నెలకొంది. మరోవైపు యనమల పార్టీకి చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని హై కమాండ్ ఏదో ఒక కీలకపదవి ఇస్తుందని, లేదా 2027 లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సి స్థానాల్లో అయినా ఆయనకు చోటు కల్పిస్తారని యనమల సన్నిహితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి చూడాలి యనమల పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండబోతుందో?

# తెలుగు యూనివర్సిటీ పేరు మార్పుపై రగడ..




**హైదరాబాద్, మార్చి 17, పెన్ పవర్:** ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరు త్వరలో మారనుంది. బదులుగా ప్రముఖ తెలంగాణ కవి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును ఆ యూనివర్సిటీకి పెట్టనున్నారు. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయం చట్టానికి సవరణ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 15న అసెంబ్లీలో బిల్లు కూడా ప్రవేశపెట్టగా.. మంత్రి మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గత సెప్టెంబరు 20న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సురవరం పేరు పెట్టాలని నిర్ణయించగా.. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేశాఉ. పదో షెడ్యూల్‌లో ఈ వర్సిటీ ఉండటంతో ఇప్పటివరకు పేరు మార్చలేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కేవలం తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ఈ యూనివర్సిటీలో ప్రవేశాలను పరిమితం చేశారు. దీంతో 1985 డిసెంబరు 2న స్థాపించిన తెలుగు యూనివర్సిటీ పేరును రేవంత్ ప్రభుత్వం మార్చిందితెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని శ్రీరాములు జయంతి సందర్భంగా కేంద్ర బండి సంజయ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు. అలాంటి మహనీయుని పేరును తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సురవరం ప్రతాప్‌రెడ్డి అంటే మాకు గౌరవం ఉంది. ఆయన తెలుగు భాష ఉన్నతికి కృషి చేశారు. తెలుగు భాషాభివృద్ధి కార్యక్రమాలకు ఆయన పేరును జరిపితే బాగుంటుంది. కానీ వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం ఆయనను అవమానించడం అవుతుంది. ఆంధ్రా మూలాలు ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించిన కాంగ్రెస్ సర్కారు.. ఎన్టీఆర్ పార్కు, కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి పార్కుల పేర్లను, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం పేరును మార్చగలదా? అంటూ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం తమ తప్పిదాన్ని సరిదిద్దుకొని తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడంపై ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడుకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న జన్మించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో న్యాయవాద విద్య అభ్యసించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. 1952లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా హైదరాబాద్ స్టేట్ శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏడాదే 1953 ఆగస్టు 25న ఆయన మృతి చెందారు. ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్రకు 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది.

## పది సూత్రాలతోనే పోస్టులు...

**తిరుపతి, మార్చి 17, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పోస్టు భర్తీ విషయంలో కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తుండటంతో దిగువ స్థాయి నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాము పడిన కష్టానికి ఈసారైనా ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. ఇటు కూటమిలోని అన్ని పార్టీలూ నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేల నుంచి ముఖ్య నేతలు, కార్యకర్తల పేర్లను పంపాలని చంద్రబాబు నాయుడు సూచించడంతో వారు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల నుంచి పేర్లు అయితే వచ్చాయి. పోటీ మాత్రం తీవ్రంగా ఉంది. ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ఇంకా కసరత్తు కొనసాగుతుంది. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో చంద్రబాబు అనేక సూత్రాలను పాటిస్తున్నారు. ప్రాంతాలు, కులాలు, పార్టీల వారీగా పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమైన, ప్రాధాన్యత కలిగిన పోస్టులకు గత ఎన్నికల్లో సీట్లు దక్కని వారి పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. వారిని కొంత కాలం నామినేటెడ్ పదవుల్లో ఉంచితే కొంతలో కొంత ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ తగ్గుతుందని భావిస్తున్నారు. అందుకే మాజీ ఎమ్మెల్యేలను, గత ఎన్నికల్లో టిక్కెట్ రాని వారికి ముఖ్యమైన పోస్టుల్లో నియమించాలన్న ప్రతిపాదన ఒకటి ఆయన సీరియస్ గానే పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కొన్ని ముఖ్యమైన నేతలకు ఇప్పటికే ఫోన్లు చేసి సమాచారం అందించి వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నట్లు చెబుతున్నారు. రెండు హామీల విధివిధానాలపై చర్చ ప్రధాన దేవాలయాల్లో... ముఖ్యంగా ప్రధాన దేవాలయాల్లో బాగా కష్టపడి పనిచేసిన నేతలకు, కార్యకర్తలకు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పాలకమండలిని భర్తీ చేసే ఉద్దేశ్యంతో ఉన్న ఆయన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ముఖ్యమైన నేతలకు ఇవ్వాలని భావిస్తున్నారు. పోస్టులు తక్కువ, పేర్లు ఎక్కువగా ఉండటంతో మొదటి రెండు జాబితాల్లో రాని వారికి మలి జాబితాలో చోటు కల్పించాలని చూస్తున్నారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో పాటు తాను సొంతంగా నియోజకవర్గాల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆయన పేర్లను ఖరారు చేస్తుండటంతో పాటు లోకేశ్ సూచించిన వారికి కూడా కొంత ప్రాధాన్యత దక్కే అవకాశాలున్నాయి. దీంతో తమ్ముళ్లలో టెన్షన్ నెలకొంది. తమకు ఈసారైనా పదవులు వస్తాయా? రావా? అన్న దానిపై ఆందోళనలో ఉన్నారు.

## వర్మ త్యాగంపై సోషల్ మీడియాలో ఫైట్

**కాకినాడ, మార్చి 17 పెన్ పవర్:** జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు పిఠాపురంలో జరిగిన సమావేశం తర్వాత రాష్ట్రంలో కూటమిలోని ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరిగింది. పిఠాపురం వేదికగా చేసిన వ్యాఖ్యలు రెండుపార్టీల క్యాడర్ సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకునే పరిస్థితి ఏర్పడింది. పార్టీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య కెమెస్ట్రీ బాగానే ఉన్నప్పటికీ క్యాడర్ మాత్రం పూర్తిగా ఈ సభ తర్వాత విడిపోయినట్లే కనిపిస్తుందని సోషల్ మీడియాలో పోస్టింగ్ లు చూస్తుంటే అర్థమవుతుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఎవరి వల్ల గెలుపు అనే అంశంపై తమకు తోచినట్లు పెడుతున్న కామెంట్స్ కాక రేపుతున్నాయ్. జయకేతనం సభలో పవన్ కల్యాణ్ తో పాటు నాగబాబు చేసిన వ్యాఖ్యలు ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా హీట్ ను రెండు పార్టీలలో పుట్టించిందనే చెప్పాలి. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న తెలుగుదేశాన్ని తానే నిలబెట్టానని పవన్ కళ్యాణ్ అన్న కామెంట్లు, వర్మను ఉద్దేశించి నాగబాబు పరోక్షంగానే చేసిన కామెంట్ల పైనే ఇప్పుడు సోషల్ మీడియాలో తమ్ముళ్లు బాధపడిపోతున్నారు. తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీని ఒకరు నిలబెట్టేదేంటని ప్రశ్నిస్తున్నారు. తమకు 175 నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు, క్యాడర్ బలంగా ఉందని, జనసేన ఎన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉందో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ విషయాలు తెలియకుండా మాట్లాడితే ఊరుకోబోమంటూ ఒకరకంగా వార్నింగ్ లు ఇచ్చినట్లే వారి కామెంట్స్ కనపడుతున్నాయి జనసేన క్యాడర్ కూడా ధీటుగానే సమాధానం ఇస్తుంది. నిజానికి జైల్లో ఉన్న చంద్రబాబును పవన్ కల్యాణ్ పరామర్శించడం దగ్గర నుంచి కూటమి ఏర్పాటు వరకూ ఆయన చేసిన కృషిని మరిచిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న టీడీపీని పవన్ కల్యాణ్ ఆదుకున్న విషయాన్ని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందేనని, ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని నిలదీస్తున్నారు. తాము కష్టపడి పనిచేయడం, తక్కువ సీట్లకే పోటీ చేయడం, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు పట్టున్నా ఓటు చీలకుండా కూటమి గెలుపునకు కారణం ఎవరనివారు సోషల్ మీడియా వేదికగా అంటున్నారు. దీంతో .. కూటమి మధ్య అగాధం ఏర్పడుతుందనే ఆందోళన ఇరు పార్టీల నేతల్లో కనిపిస్తుంది. నాగబాబు విషయాన్ని పెద్దగా సీరియస్ గా తీసుకోకపోయినా.. వర్మ చేసిన త్యాగాన్ని ఆయన కించపర్చడం ఏంటని టీడీపీ క్యాడర్ గుర్రుగా ఉంది. గతంలో వర్మ స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఎవరికి ఎన్ని ఓట్ల శాతం వచ్చాయో తెలుసుకుంటే బాగుంటుందని కూడా సూచిస్తున్నారు. కూటమి అంటే కలసి పోటీ చేయడం, కలసి పనిచేయడమేనని, అంతే తప్ప ఏ ఒక్కరి వల్లో విజయం సాధ్యం కాదని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని భావించి జనం ఓట్లేశారని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇదే సమయంలో జనసేన ను కించపరిస్తే నష్టపోయేదే మీరేనంటూ జనసైనికులు కూడా హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద జయకేతనం సభ మాత్రం రెండు పార్టీల క్యాడర్ లో గ్యాప్ మాత్రం బాగానే కనిపిస్తుంది. ఇద్దరూ సంయమనం పాటిస్తేనే మంచిదని, లేకుంటే ఇరువురికి నష్టమన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

### పోలీసులు జగన్ కు కొమ్ముకాస్తున్నారు

## దస్తగిరి భార్య ఆవేదన





**కడప, మార్చి 17, పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులు రెండు రాష్ట్రాల్లో ఎంతటి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. హత్యకేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరి భార్య షాబానా మీద దాడి జరిగింది. ఇద్దరు వైసీసీ మహిళా కార్యకర్తలు తన మీద దాడికి పాల్పడ్డారని దస్తగిరి భార్య వెల్లడించింది. పులివెందుల నియోజక వర్గంలోని తొండూరు మండలం మల్యాల గ్రామంలో తన మీద దాడి చేశారని తెలిపింది.మల్యాల గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లిన షాబానా మీద ఇద్దరు మహిళా కార్యకర్తలు ఇంట్లోకి చొరబడి ఉద్దేశ పూర్వకంగానే తనను బూతులు తిడుతూ దాడి చేశారని షాబానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. ప్రశాంతంగా కొనసాగుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. కొందరు మహళలు తన ఇంట్లోకి చొరబడి.. ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని షాబానా తెలిపారు. వాళ్లు అంతటితో ఆగకుండా ఏడాదిలోపు నీ భర్త దస్తగిరిని నరికేస్తామని ఇద్దరు వైసీపీ కార్యకర్తలు హెచ్చరించారని షాబానా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జగన్, అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా నీ భర్త మాట్లాడేంత ధైర్యం ఎక్కడికి వచ్చిందంటూ విచక్షణా రహితంగా కొట్టారని ఆమె తెలిపారు. అదే సమయంలో మరో ఇంట్లో ఉన్న దస్తగిరి సమాచారం అందుకుని వెంటనే ఘటనా స్థలానికి గన్ మెన్లతో వచ్చినప్పటికీ ఇద్దరు మహిళలు ఏ మాత్రం తగ్గకుండా దంపతుల ఇద్దరిపై ఇష్టానుసారంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తొండూరు పులివెందుల రూరల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ వాళ్లు ఇంతవరకు కేసు నమోదు చేయలేదని షాబానా వాపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..“ జగన్మోహన్ రెడ్డి, అవినాష్ రెడ్డికి వ్యతిరేకంగా దస్తగిరి మాట్లాడుతారా ? అంటూ విచక్షణారహితంగా కొట్టారు. మల్యాల గ్రామానికి చెందిన శంషున్, పర్వీన్ లను ఎవరు పంపితే నా మీద దాడి చేశారో పోలీసులు తేల్చాలి. వివేకా వాచ్‌మెన్ రంగన్న చనిపోయిన తర్వాత నా భర్తను చంపాలని చూస్తున్నారు. సంవత్సరంలో చంపేస్తాము. ముక్కలు ముక్కలుగా నరికేస్తామన్నారు. జగన్, అవినాష్ రెడ్డిల మీద తప్పుడు సాక్ష్యం చెప్పి జైలుకు పోయి వచ్చిన తర్వాత హారతులు ఇస్తావా.. అంటూ నన్ను విచక్షణారహితంగా బూతులు మాట్లాడుతూ కొట్టారు. దస్తగిరిని చంపిన నాలుగేళ్ల తర్వాత నన్ను చంపుతామన్నారు. ఇద్దరు మహిళలు పదే పదే అవినాష్ రెడ్డి పేరు ప్రస్తావించారు. ఘటన జరిగి 3 రోజులైనా ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు” అని షబానా ఆవేదన చెందారు.

# హ్యారీ బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం.. మొయిన్ అలీ ఇలా అనేశాడేంటి!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్ యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్?పై బీసీసీఐ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అర్ధాంతరంగా ఐపీఎల్ నుంచి తప్పుకోవడంతో బ్రూక్ పై రెండేళ్ల పాటు ఐపీఎల్?లో ఆడే అవకాశం లేకుండా బ్యాన్ చేసింది. దీని ప్రకారం ఈ ఇంగ్లీష్ యువ బ్యాటర్ 2025, 2026 ఐపీఎల్ సీజన్స్?లో ఆడడానికి వీలు లేదు. వేలంలో ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేసిన తర్వాత.. ఆ ఆటగాడు గాయపడితే తప్ప ఇతర ఏ కారణంతో విదేశీ ఆటగాళ్లు వైదొలిగినా రెండేళ్ల నిషేధం తప్పదని ఐపీఎల్ నియమనిబంధనల్లో స్పష్టంగా ఉంది. ఈ రూల్ విధించిన తర్వాత నిషేధం ఎదర్కొన్న తొలి ఆటగాడు బ్రూక్. బ్రూక్ పై నిషేధం విధించడడంతో ఇంగ్లాండ్ మాజీ ఆల్ రౌండర్ మొయిన్ అలీ బీసీసీఐ రూల్ ను సమర్థించాడు. ఈ ఇంగ్లీష్ ఆల్ రౌండర్ నిషేధం ఖచ్చితంగా 'కఠినమైనది' కాదని చెప్పాడు. అలీ మాట్లాడుతూ.. "గతంలో చాలా మంది విదేశీ ఆటగాళ్లు ఇలాగే చేశారు. ఆపై తిరిగి వచ్చి మెరుగైన ఆర్థిక ప్యాకేజీని పొందారు. ఇలాంటి విషయాలు గందర గోళానికి గురి చేస్తాయి. బ్రూక్ తప్పుకోవడంతో ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ తమ ప్రణాళికలన్నింటినీ మార్చుకోవడం చాలా కష్టంతో కూడుకున్నది. కుటుంబ కారణాల వల్ల లేదా గాయం వలన తప్పుకుంటే అది వేరుగా ఉండేది. కానీ బ్రూక్ కారణం వేరుగా ఉంది. ఈ విషయంలో నేను బీసీసీఐ రూల్ తో ఏకీభవిస్తున్నాను". అని మొయిన్ చెప్పుకొచ్చాడు.

బ్రూక్ ఐపీఎల్

కంటే దేశానికే ఎక్కువగా ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లాండ్ క్రికెట్ పైనే ఆడడంపై తాను దృష్టి పెట్టినట్టు ఖరాఖండిగా చెప్పేశాడు. బ్రూక్ ప్రస్తుతం ఇంగ్లాండ్ టెస్ట్ జట్టులో రెగ్యులర్ ప్లేయర్. జూన్ నెలలో ఇండియాతో ఇంగ్లాండ్ ఐదు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్ ఆడనుంది. 2025-27 టెస్ట్ ఛాంపియన్స్ షిప్ లో భాగంగా ఇంగ్లాండ్ ఆడుతున్న తొలి సిరీస్ ఇది. ఈ సిరీస్ పైనే బ్రూక్ తన పూర్తి దృష్టి పెట్టనున్నట్టు తెలుస్తుంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ హ్యారీ బ్రూక్ ను రూ. 6.25 కోట్లకు దక్కించుకుంది. బ్రూక్ స్థానంలో ఢిల్లీ ఇంకా ఎవరినీ తీసుకోలేదు. ఐపీఎల్ నుంచి తనకు తప్పుకోవడంపై ఢిల్లీ క్యాపిటల్స్ కు బ్రూక్ క్షమాపణలు తెలిపాడు.

# మా టైమ్ వస్తుంది.. వరుసగా ఐదు ఐపీఎల్ టైటిల్స్ కొడతాం: రూ. 11 కోట్ల RCB ప్లేయర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. విరాట్ కోహ్లీ, డివిలియర్స్, గేల్ లాంటి ఆటగాళ్లు ఈ జట్టుకు ఆడడం వలన ఫాలోయింగ్ అమాంతం పెరిగింది. ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ ఐపీఎల్ మొదటి సీజన్ నుంచి ఆర్‌సీబీకి టైటిల్ అనేది అందని ద్రాక్షే. ప్రతిసారి ఎన్నో ఆశలతో టోర్నీలోకి అడుగుపెట్టడం, బొక్కాబోర్లా పడడం ఆ జట్టుకు పరిపాటి. ఆటగాళ్లను మార్చినా.. కెప్టెన్లను మార్చినా.. ఆఖరికి ఆ జట్టు కోచ్ ను మార్చినా.. ఫలితం మాత్రం మారడం లేదు. 2016 లో ఫైనల్లో విజయం అంచు వరకు వచ్చి ఓడిపోయింది.గత సీజన్ లో వరుసగా 7 మ్యాచ్ ల్లో గెలిచి ప్లే ఆఫ్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకున్న ఆర్సీబీ.. ఎలిమినేటర్ మ్యాచ్లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడిపోయింది. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న సీజన్ లో ఈ సారి కొత్త జట్టుతో బరిలోకి దిగుతుంది. కోహ్లీ, యష్ దయాల్, పటిదార్ మినహాయిస్తే ఈ సారి జట్టు మొత్తం మారిపోయింది. దీంతో ఈ సీజన్ లో అయినా ఆ జట్టు టైటిల్ అందుకోవాలని ఫ్యాన్స్ భావిస్తున్నారు.ఈ సారి ఆర్సీబీ టైటిల్ గెలిపించడమే తన లక్ష్యమని.. ఆ జట్టులో చేరిన కొత్త వికెట్ కీపర్ జితేష్ శర్మ సీజన్ కు ముందు ధీమా వ్యక్తం చేశాడు.

జితేష్ దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ పట్ల తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ, తన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (%ఖూా%) కలను పంచుకున్నాడు. క్రిక్‌స్టాసీతో ప్రత్యేక పాడ్‌కాస్ట్‌లో మాజీ పంజాబ్ కింగ్స్ (%ూదీఖూ%) స్టార్ ఈ విధంగా మాట్లాడాడు. " ఈ సీజన్ ఐపీఎల్ గెలవాలనుకుంటున్నా. గెలిచి విరాట్ కోహ్లీకి అంకితమిస్తాను. ఆర్సీబీ జట్టుకు ఫినిషర్ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాను. ఈ సీజన్ లో మేము 14 మ్యాచ్ ల్లో 11 మ్యాచ్ లు గెలుస్తాం. మా టైం వచ్చి ఒక్కసారి ఆర్సీబీ టైటిల్ గెలిస్తే వరుసగా ఐదు సీజన్ లలో టైటిల్స్ గెలుస్తుంది". అని జితేష్ అన్నాడు.ఇదిలా ఉండగా ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ లో జితేష్ శర్మను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ 11 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు మెగా వేలంలో మొత్తం 19 మంది ప్లేయర్లను కొనుగులు చేసింది. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ ను అత్యధికంగా రూ.12.50 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఈ సీజన్ లో తమ తొలి మ్యాచ్ ను డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్ కతా నైట్ రైడర్స్ తో తలపడనుంది. ఈ సీజన్ కు ఇదే తొలి మ్యాచ్ కావడం విశేషం.

# అనుభవానికే ఓటు.. వైస్ కెప్టెన్‌ను ప్రకటించిన ఢిల్లీ క్యాపిటల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తమ వైస్ కెప్టెన్ ను ప్రకటించింది. ఇటీవలే ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ను కెప్టెన్ గా నియమించిన ఢిల్లీ ఫ్రాంచైజీ.. సోమవారం (మార్చి 17) తమ జట్టుకు వైస్ కెప్టెన్ ఎవరో రివీల్ చేసింది. గత సీజన్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కెప్టెన్ గా చేసిన సౌతాఫ్రికా బ్యాటర్ ఫాఫ్ డు ప్లెసిస్‌ను తమ వైస్ కెప్టెన్ గా నియమిస్తూ అధికారికా ప్రకట చేసింది. సోమవారం మధ్యాహ్నం వారి అధికారిక ఎక్స్ లో పోస్ట్ చేస్తూ ఈ విషయాన్ని ధృవీకరించింది. 2025 నవంబర్ 25న జరిగిన మెగా వేలంలో మాజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫాఫ్ డుప్లెసిస్ ను రూ. 2 కోట్ల కనీస ధరకు ఢిల్లీ క్యాపిటల్స్ దక్కించుకుంది. మొదట్లో ఈ సఫారీ బ్యాటర్ ను కొనడానికి ఏ ఒక్కరు కూడా ఆసక్తి చూపించకపోవడం విచారకరం. చివరికి ఢిల్లీ క్యాపిటల్స్ అతన్ని కనీస ధర రూ. 2 కోట్లకు దక్కించుకుంది. డుప్లెసిస్ పై నమ్మకం ఉంచడమే కాదు అతనికి ఏకంగా వైస్ కెప్టెన్ గా నియమించడం విశేషం. డుప్లెసిస్ ఐపీఎల్ మూడు సీజన్ ల పాటు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కెప్టెన్ గా చేసిన అనుభవం ఉంది. బ్యాటర్ గాను అద్భుతంగా రాణించగల ఈ సౌతాఫ్రికా ఆటగాడిపై ఢిల్లీ క్యాపిటల్స్ భారీ ఆశలే పెట్టుకుంది. ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్ కు కేఎల్ రాహుల్, మిచెల్ స్టార్క్ రూపంలో ఆ జట్టు బలంగా కనిపిస్తుంది. డుప్లెసిస్ చేరడంతో ఆ జట్టు బలం పెరగనుంది. ఐపీఎల్ 2024 సీజన్ లో డుప్లెసిస్ బాగా ఆడినప్పటికీ అతని మీద బెంగళూరు జట్టు నమ్మకం ఉంచలేదు. రిటైన్ చేసుకోకుండా వేలంలో అతన్ని రిలీజ్ చేసింది. గత సీజన్ లో రూ. 7 కోట్లకు ఆర్సీబీ తరపున ఆడాడు. ప్రస్తుత ప్రపంచ క్రికెట్ లో ఈ సౌతాఫ్రికా ప్లేయర్ సూపర్ ఫామ్ లో ఉన్నాడు. అబుదాబి టీ20 లీగ్ లో అదరగొట్టాడు.

**ఐపీఎల్ 2025 ఢిల్లీ క్యాపిటల్స్ స్క్వాడ్**

అభిషేక్ పోరెల్, ఫాఫ్ డు ప్లెసిస్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్, డోనోవన్ ఫెరీరా, అజయ్ మండల్, మన్వంత్ కుమార్, అశుతోష్ శర్మ, మాధవ్ తివారీ, దుష్మంత చమీర, కుల్దీప్ యాదవ్, నివేద్‌రాజ్ కుమార్, మిచెల్ స్టార్క్, త్రిపురాన విజయ్

## వైట్‌లో గార్జియస్ కావ్యా థాపర్ విజన్



# 'హిట్ 3'.. నాని గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు!

నాని హీరోగా నటించనున్న 'హిట్ 3' సినిమా గురించి రోజుకో కొత్త అప్డేట్ బయటికి వస్తోంది. మొదటి రెండు భాగాల్లో వరుసగా విశ్వక్ సేన్, అడివి శేష్‌లు లీడ్ రోల్స్ చేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీలో.. ఇప్పుడు నాని మెయిన్ లీడ్‌గా వస్తుండటం సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇదే సర్‌ప్రైజ్‌కు తోడు.. ఈ సినిమాలో మరో ఆసక్తికరమైన నటుడిని తీసుకొచ్చినట్టు సమాచారం. సినిమా కేవలం తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా.. పాన్ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఉండబోతోందట.దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత విస్తృతంగా అందరికి కనెక్ట్ అయ్యేలా డిజైన్ చేశారని సమాచారం. కాశ్మీర్ నుంచి బీహార్ వరకు విస్తరించిన కథాంశంతో, ఇండియా మొత్తం తిరిగే ప్లాన్‌లో ఉన్నట్లు టాక్. ఇందులో హిందీలోనే మాట్లాడే ఒక క్యారెక్టర్ కాస్త హైలెట్ అవుతుందట. ఇక అందుకు అవసరమయ్యే క్యారెక్టర్‌కు ఒక ప్రముఖ నటుడిని తీసుకున్నారట. అతను మరెవరో కాదు, 'సూపర్ బాయ్స్ ఆఫ్ మలేగావ్' ఫేమ్ సాకిబ్ అయూబ్ అని తెలుస్తోంది. నానికి ఏ క్యారెక్టర్ కోసం ఏం కావాలో స్పష్టంగా తెలుసు. అందుకే తన వాయిస్, యాక్టింగ్ పరంగా బాగా కనెక్ట్ అయ్యేలా చేసినట్టు చెబుతున్నారు. సినిమా ప్రీ ప్రొడక్షన్ సమయంలోనే సాకిబ్‌ను ఈ పాత్రకు తీసుకోవాలని నాని డిసైడ్ అయ్యాడట.

మొదటిసారి నానితో కలిసి పనిచేసే అవకాశం రావడంతో, సాకిబ్ ఆశ్చర్యపోయాడట. కానీ షూటింగ్ మొదలైన తర్వాత ఆయన నాని వర్కింగ్ స్టైల్, పర్ఫెక్షన్ చూసి నానికి అంతం రిస్పెక్ట్ ఎందుకు ఇస్తారో అర్థమైందని అంటున్నాడు. సినిమా పాన్ ఇండియా లెవల్లో నిర్మించబోతుండటంతో.. ఇందులోని పాత్రలకు మరింత ప్రాముఖ్యత పెరిగిందట.'హిట్ 3'లో నాని చేసే పాత్రలో భారీ యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయని టాక్. ఇదివరకు వచ్చిన రెండు పార్ట్స్‌లోనూ డిటెక్టివ్ థ్రిల్లర్ టోన్ ఎక్కువగా ఉండగా.. ఈసారి మాత్రం స్టోరీ మలుపులు మరింత థ్రిల్లింగ్‌గా ఉండబోతున్నాయి. పైగా గత సినిమాల కంటే స్క్రీన్‌ప్లేలో ఇన్వెస్టిగేషన్‌ను మళ్లీ కొత్తగా ట్రై చేసినట్టు తెలుస్తోంది. హిందీ బాషా నేపథ్యంతో కూడిన క్యారెక్టర్ కావడం వల్ల సాకిబ్ ఈ సినిమా కోసం స్పెషల్‌గా వాయిస్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాడట.ఇక నాని 'హిట్ 3'కి మాత్రమే కాదు, ఈ ఫ్రాంచైజీకి నిర్మాతగా ఉండడం అతనికి స్పెషల్ క్రెడిట్ తెచ్చిపెట్టింది. గతంలో వచ్చిన రెండు భాగాలూ నాని బ్యానర్‌లోనే వచ్చాయి. కానీ ఈసారి మూడో పార్ట్‌లోనే మెయిన్ లీడ్‌గా నటిస్తూ మరో ప్రయోగం చేస్తున్నాడు. ఇది కచ్చితంగా సినిమాకు మరింత బలం ఇవ్వబోతుంది. థ్రిల్లర్ జానర్‌కు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యాన్ని నాని ఎలాగైనా మరింత ప్రామాణికంగా ఉపయోగించుకోవాలని ప్లాన్ చేస్తున్నాడు.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా 2025లో విడుదల కానుంది. అందులోనూ హిట్ ఫ్రాంచైజీ గత రెండు సినిమాలకు బాగా పేరు రావడం, టెక్నికల్ వాల్యూస్ పరంగా చాలా హై స్టాండర్డ్స్‌లో ఉండటంతో 'హిట్ 3'పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి, నాని ప్రధాన పాత్రలో వచ్చిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



## రాశి ఖన్నా యొక్క అద్భుతమైన క్లిక్‌లు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com